
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
గురువారం 18 జూలై 2024



# కోటప్పకొండపై.. తొలి ఏకాదశి సందడి

కోటప్పకొండ (నరసరావుపేట), జూలై 17 : తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర సన్నిధిలో బుధవారం భక్తుల కోలాహలం నెలకొంది. స్వామికి పంచామృతాలు, విశేష ద్రవ్యాలతో రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు కొండకు వేలాదిగా తరలి వచ్చి కోటయ్య స్వామిని దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు పొంగళ్ళు చేసి స్వామికి సమర్పించారు. ఆనందవల్లి అమ్మ వారిని దర్శించుకుని పూజలు చేశారు. సోపాన మార్గంలో భక్తులు మెట్ల పూజలు చేశారు. వినాయక స్వామి విగ్రహం, ధ్యాన శివుని విగ్రహం, నాగేంద్రుని పుట్ట వద్ద భక్తులు పూజలు చేశారు. ఎమ్మెల్యేలు డాక్టర్ అరవింద బాబు, ప్రత్తిపాటి పుల్లారావు శ్రీ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఏసీ ఎస్ శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసింది. వివిధ సేవా సంస్థలు ప్రసాదం పంపిణీ చేశాయి.

### శ్రీ త్రికోటేశ్వర స్వామికి నాగాభరణం

శ్రీ త్రికోటేశ్వర స్వామికి భక్తులు వెండికి బంగారం పోత పోసిన నాగాభరణం సమర్పించారు. రూ 6 లక్షల విలువైన నాగాభరణాన్ని పెదనందిపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన మహంకాళి నాగరాజు, లక్ష్మీ, మహంకాళి శ్రీకాంత్, లక్ష్మీ స్వామికి కానుకగా ఇచ్చారు.

### ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్

ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంలో పోలీసులు విఫలమయ్యారు. ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించి గంటన్నర పాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో భక్తులు ఇక్కట్లు పడ్డారు. ఎమ్మెల్యే పుల్లారావు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు.


జలాభిషేకం


పసుపుతో..


కుంకుమతో..


గంధంతో..


విభూదితో..


ప్రత్యేక అలంకారం

# సర్టిఫికెట్ కష్టాలు తీరినట్లే..

- ఇంజనీరింగ్ కళాశాలల ఫీజు బకాయిలు చెల్లింపునకు గ్రీన్‌సిగ్నల్
- ఉమ్మడి జిల్లాలో బకాయిలు రూ.80 కోట్లుపైనే
- వైసీపీ జమానాలో ఖాతాల్లో జమ కాని ఫీజులు



బీటెక్, ఫార్మసీ డిగ్రీ పూర్తి అయినా సర్టిఫికెట్లు చేతికి రాక ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్న ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థుల కష్టాలు త్వరలో తీరనున్నాయి. కళాశాలలకు ఉన్న బకాయిల్ని చెల్లించడానికి ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడంతో ఇటు విద్యార్థుల్లో, అటు యాజమాన్యాల్లో హర్షం వ్యక్తం అవుతోంది. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలకు నేడు విద్యార్థులు పడుతున్న మానసిక క్షోభకు పరిష్కారం లభించనుంది.

గుంటూరు(విద్య),జులై 17: ఉమ్మడి జిల్లాలో దాదాపు 35కి పైగా ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో బీటెక్, ఫార్మసీ చివరి సంవత్సరం చదివే విద్యార్థులు దాదాపు 15 వేల మందికిపైగా ఉండవచ్చని అంచనా. గత ప్రభుత్వం కళాశాలల వారీగా ఫీజుల్ని నిర్ణయించింది. ఇందులో భాగంగా రూ.40 వేల నుంచి రూ.75 వేలకుపై ఫీజుల్ని కళాశాలల్లో ఉన్న వసతుల్ని బట్టి నిర్ణయించింది. అయితే ఈ ఫీజుల విషయంలో అనేక కళాశాలల యాజమాన్యాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫీజులను సవరించాలని యాజమాన్యాలు అనేకసార్లు కోరినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో అనేక కళాశాలలు నిర్వహణ భారం మోయలేక ఆర్థికంగా కుదేలయ్యాయి.

### కొత్త విధానంతో ఇక్కట్లు

ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో తీసుకువచ్చిన కొత్త విధానం అటు విద్యార్థులకు, ఇటు యాజమాన్యాలకు తలనొప్పిగా పరిణమించింది. గతంలో ప్రభుత్వం చెల్లించే ఫీజులు విడతల వారీగా నేరుగా కళాశాలల ఖాతాలకు జమయ్యేది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఫీజుల విషయంలో రివర్స్ విధానం తీసుకువచ్చింది. విడతల వారీగా సీఎం జగన్ బటన్ నొక్కి ఫీజుల్ని విద్యార్థుల తల్లుల ఖాతాలకు మళ్ళించారు. ఖాతాల్లో జమ అయిన ఫీజుల్ని బ్యాంకుల నుంచి డ్రా చేసి తల్లులు కళాశాలలకు చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అనేక సార్లు బటన్ నొక్కినా ఫీజులు సకాలంలో వారి ఖాతాల్లో జమకాలేదు. ఒకవేళ తల్లుల ఖాతాల్లో డబ్బులు పడినా, వాటిని వారు సొంత అవసరాలకు వాడుకున్న ఉదంతాలు ఉన్నాయి. ప్రతి కళాశాల పరిధిలో కనీసం 35 నుంచి 45శాతం మంది ఇలా ఫీజుల్ని చెల్లించలేదు. ఈ పరిస్థితుల్లో సకాలంలో ఫీజుల చెల్లింపులు జరగక పోవడంతో కళాశాలల నిర్వహణ యాజమాన్యాలకు కష్టంగా మారింది. ఒకవైపు సకాలంలో ఫీజుల బకాయిలు విడుదల కాకపోవడం, వచ్చిన ఫీజుల్ని తల్లిదండ్రులు సకాలంలో చెల్లించక పోవడం వంటి కారణాలు జిల్లాలో నెలకొన్నాయి. ఉమ్మడి జిల్లాలో బీటెక్ చివరి సంవత్సరం వరకు విద్యార్థుల ఫీజుల బకాయిలు రూ.80 కోట్లు వరకు ఉన్నట్లు సమాచారం. దీంతో ఫీజుల బకాయిలు పూర్తి స్థాయిలో చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటూ యాజమాన్యాలు విద్యార్థులకు తెగేసి చెప్పాయి. ఫలితంగా బీటెక్, ఫార్మసీ పూర్తి అయినా సర్టిఫికెట్లు చేతికి రాని పరిస్థితి నెలకొంది. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు వచ్చిన విద్యార్థులు, ఎంటెక్ ఇతర కోర్సులకు దరఖాస్తు చేసిన అనేక మంది ఇక చేసేది లేక కళాశాలకు పూర్తిస్థాయిలో బకాయిలు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకోవాల్సి వచ్చింది. ఇదిలా ఉంటే ఈ ఏడాది నుంచి పాత పద్ధతిలోనే ఫీజులు చెల్లించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. నేరుగా కళాశాలల ఖాతాలకే ఫీజులు చెల్లించేలా ఏర్పాట్లు చేస్తుంది.

### మొదటి విడత సీట్లు కేటాయింపు పూర్తి

ఏపీఈఏపీసెట్‌లో ర్యాంకులు సాధించి వెబ్ ఆప్షన్లు పెట్టుకున్న వారికి మొదటి విడత సీట్ల కేటాయింపు బుధవారం పూర్తి అయింది. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 17 నుంచి 22లోగా సంబంధిత కళాశాలల్లో రిపోర్టు చేయాలని ఉన్నత విద్యామండలి ప్రకటించింది. ఉమ్మడి జిల్లాలో కొన్ని పేరున్న కళాశాలల్లో మాత్రమే పూర్తిస్థాయి సీట్లు భర్తీ అయ్యాయి. త్వరలో నిర్వహించే రెండు, మూడు కౌన్సెలింగ్‌లలో సీట్లు భర్తీ అయ్యే అవకాశం ఉందని యాజమాన్యాలు చెబుతున్నాయి.

# ప్రభుత్వ భూమి.. ప్రభుత్వానికే.. దానం!

నిరుపేదలకు అసైన్డ్ చేసిన ప్రభుత్వ భూమిని చట్ట ప్రకారం కొనడం, అమ్మడం నేరం.. అంటే చట్టప్రకారం ఆ భూమిపై సర్వహక్కులు ప్రభుత్వానివే.. అలాంటిది బాపట్ల మెడికల్ కళాశాలకు కేటాయించిన స్థలంలో ఓ రేంజ్ జగన్నాటకానికి గతంలో వైసీపీ ప్రభుత్వం తెరలేపింది. అసైన్డ్ భూమి అంటేనే అది సాంకేతికంగా ప్రభుత్వ భూమి కింద లెక్క..అలాంటిది దానిని ఓ వ్యక్తి ఉదార వైఖరితో బాపట్ల మెడికల్ కళాశాల నిర్మాణం కోసం దానం ఇచ్చారట.. అది నచ్చి ఏకంగా అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి చేత సదరు వ్యక్తికి సన్మానం కూడా చేయించారు.. ఈ తంతు అంతటిని అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా అధికారులు చోద్యం చూశారు. ఇది బాపట్ల మెడికల్ కళాశాల స్థలం విషయంలో వైసీపీ ప్రభుత్వంలో చోటు చేసుకున్న వింతవైఖరి. అన్నింటికన్నా మించి పరాకాష్ట ఏమిటంటే అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్ మెడికల్ కళాశాల నిర్మాణం కోసం ఆ భూమిలో పేదలెవరు లేని కారణంగా దానిని తిరిగి తీసుకుంటున్నట్లు ఉత్తర్వులు కూడా ఇచ్చారు. మరి ఇక్కడ వితరణకు అవకాశం ఎక్కడ ఉందనే దానికి అప్పటి ప్రభుత్వమే సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఈ మొత్తం ప్రక్రియ వెనకాల మెడికల్ కళాశాల చుట్టూ ఉన్న అసైన్డ్ భూముల ధర పెంచే కుట్ర జరిగిందనే అనుమానాలు అప్పట్లోనే వ్యక్తమయ్యాయి.


దానికి సీఎంతో సన్మానం

- అసైన్డ్ భూమికి కొత్త భాష్యం చెప్పిన వైసీపీ
- బాపట్ల మెడికల్ కళాశాల భూ వ్యవహారంపై అనుమానాలు
- మొత్తం వ్యవహారంలో క్విడ్ ప్రో కోపై సందేహాలు
- సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్లు

బాపట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బాపట్లలోని మెడికల్ కళాశాల నిర్మాణం కోసం పట్టణ శివారులోని జమ్ములపాలెం రోడ్డులో 54 ఎకరాల భూమిని అప్పటి వైసీపీ ప్రభుత్వం గుర్తించి 2021 మేలో భూమిపూజ చేపట్టింది. ఈ 54 ఎకరాలతో పాటు దీని చుట్టూ ఉన్న మరో 125 ఎకరాల వరకు అసైన్డ్ భూమిగానే ప్రభుత్వ రికార్డులు ధ్రువీకరిస్తున్నాయి. కానీ కళాశాల నిర్మాణం కోసం భూమిని దాత విరాళంగా ఇచ్చారని అప్పట్లో వైసీపీ నేతలు ప్రకటించారు. మరోవైపు ఈ భూమి అసైన్డ్ అని పేదలెవరూ లేని కారణం చేత తిరిగి ప్రభుత్వం తీసుకుని కళాశాల నిర్మాణం కోసం వినియోగిస్తున్నట్లు అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వం ఓ రకమైన ఆదేశాలిస్తే, వైసీపీ నేతలు మాత్రం ఆ భూమిని ఓ వ్యక్తి వితరణగా ఇచ్చారని ప్రచారం చేశారు..

### సన్మానం చేయడం ఏమిటి..

వైసీపీ ప్రభుత్వంలో అసైన్డ్ భూముల చట్టవిరుద్ధ క్రయవిక్రయాలకు ఏ విధంగా మద్దతు పలికారు అనేదానికి బాపట్ల మెడికల్ కళాశాల భూమి అంశాన్ని నిదర్శనంగా చెప్పవచ్చు. అసైన్డ్ భూములను కొనడమే నేరమని చట్టం చెబుతుంటే ఆ భూములను కొనుగోలు చేసి సుదీర్ఘకాలం అనుభవించిన వ్యక్తి వితరణ ఇచ్చాడని చెప్పి ఏకంగా అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డే సన్మానం చేయడం, దానికి సాక్షీభూతాలుగా ప్రభుత్వ అధికారులు నిలవడం ఏమిటనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది. కొత్తప్రభుత్వం కొలువుదీరగానే ఐదేళ్లలో జరిగిన భూ అక్రమాలపైనే ప్రధానంగా దృష్టిపెట్టింది. ముఖ్యంగా అసైన్డ్ బాగోతాలపై సమగ్ర విచారణ చేపట్టి పేదలకు న్యాయం చేయాలనే ఆలోచన కూడా కొత్త ప్రభుత్వం చేస్తోంది. ఈ నేపథ్యంలో బాపట్లలో జరిగిన మెడికల్ కళాశాల అసైన్డ్ భూమి వ్యవహారంలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే చేసిన హడావిడి మరోమారు చర్చకు వచ్చింది. అసైన్డ్ భూమిని వితరణగా ఇచ్చారని చెప్పి ఏకంగా ప్రభుత్వాధినేత చేతే సన్మానం చేయించే బరితెగింపునకు అప్పటి వైసీపీ నేతలు పాల్పడ్డారంటే చట్టాలపై వీరి లెక్కలేని తనానికి ఈ ఉదంతం ఓ ఉదాహరణగా చెప్పవచ్చు.

### తొలుత పరిహారం పేరుతో కుట్ర...

మెడికల్ కళాశాలకు భూ సేకరణ అంశం అప్పట్లో తెర మీదకు వచ్చినప్పుడు తొలుత అసైన్డ్ భూముల్లో పేదలే ఉన్నట్లు చూపి పరిహారం సాకుతో కోట్లు దోచేయాలని వైసీపీ నేతలు పథకం వేశారు. కానీ ఆ భూమి మొత్తం అసైన్డ్ చేసిందేనని, అక్కడ పేదలెవరూ సాగుచేయడం లేదనే అంశం బయటకు పొక్కడంతో వితరణ నాటకానికి వైసీపీ నేతలు ముగింపు పలికారు. భూముల ధర పెంపుకోసం క్విడ్ ప్రోకో ప్రాతిపదికనే ఈ తతంగం అంతా జరిగినట్లు సమాచారం.

### విచారణ చేయించాల్సిందే..

మెడికల్ కళాశాల చుట్టూ ఉన్న మరో 125 ఎకరాల భూమి కూడా పేదలకు అసైన్డ్ చేసినదే. ఇటీవల ప్రభుత్వం అసైన్డ్ చేసిన పేదలకు యాజమాన్య హక్కులు కల్పించే క్రమంలో బాపట్ల పరిధిలో ఉన్న దాదాపు 2300 ఎకరాలకు సంబంధించి ఒక్కరంటే ఒక్కరు కూడా ఒరిజినల్ అసైనీ సదరు భూమిని అనుభవించడం లేదని తేల్చేసి ఎవరికీ యాజమాన్య హక్కులు కల్పించలేదు. మెడికల్ కళాశాల చుట్టూ ఉన్న భూముల విషయంలో ఇదే నివేదికను గతంలో అధికారులు ఇచ్చారు. కానీ మెడికల్ కళాశాల చుట్టూ ఉన్న భూములు పేదల నుంచి వైసీపీ నేతల చేతిలోకి మారినట్లు సమాచారం. వాటికి ధర పెంచి రియల్ సొమ్ము చేసుకునే క్రమంలోనే ఈ వితరణ నాటకానికి తెరలేపి క్విడ్ ప్రో కో కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. మెడికల్ కళాశాల సమీపంలో ఉన్న అసైన్డ్ భూములలో ఒరిజినల్ అసైనీ లేరని ఇప్పటికే గత ప్రభుత్వం ధ్రువీకరించింది. అలాంటప్పుడు ఆ భూములను కూడా తిరిగి స్వాధీన పరచుకునే విధంగా కొత్త ప్రభుత్వం అడుగులు వేయాల్సి ఉంది. అప్పుడే గత ప్రభుత్వంలో వ్యూహం ప్రకారం అసైన్డ్ భూమి దానం అనే నాటకానికి తెరలేపిన వైసీపీ నేతల కుయుక్తులను చేదించినట్లవుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

### ఇంత వరకు పునాదులు దాటలేదు..

2021 మే 31న మెడికల్ కళాశాలకు ఆర్భాటంగా భూమి పూజ చేసిన వైసీపీ నేతలు తర్వాత ఏడాదిన్నర వరకు పనులు ప్రారంభించిన దాఖలాలే లేవు. ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో మళ్లీ మెడికల్ కళాశాల పనులు అంటూ హడావిడి చేశారే తప్ప దాని నిర్మాణం పూర్తి విషయంలో చిత్తశుద్ధి చూపకపోవడం గమనార్హం.


కుడి కాలువ ద్వారా విడుదలవుతున్న నీరు

# సాగర్ కుడి కాల్వకు నీటి విడుదల

- తొమ్మిది రోజులు 5, 7 గేట్ల ద్వారా దిగువకు
- తాగునీటి కోసం రోజుకు 5500 క్యూసెక్కులు

మాచర్లటౌన్, జూలై 17: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కుడి కాల్వకు బుధవారం తాగునీటిని విడుదల చేశారు. కృష్ణా నది యాజమాన్య బోర్డు ఆదేశాలతో కుడి కాల్వ 5, 7 గేట్ల ద్వారా 5500 క్యూసెక్కుల నీటిని ఓఅండ్ఎం ఈఈ శ్రీహరి స్విచ్ఛాన్ చేసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈఈ శ్రీహరి మాట్లాడుతూ తాగునీటి అవసరాల నిమిత్తం 4.5 టీఎంసీల నీటిని రోజుకు 5500 క్యూసెక్కుల చొప్పున 9 రోజులపాటు విడుదల చేయనున్నట్లు తెలిపారు. కుడి కాల్వ పరిధిలోని చెరువులు, కుంటలను నింపుకుని తాగునీటి అవసరాల నిమిత్తం వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ మురళీధర్, జేఈ బాబు మియా పాల్గొన్నారు.


నీటిని విడుదల చేస్తున్న ఈఈ శ్రీహరి

# రైళ్ల స్టాపేజ్‌ల కొనసాగింపు

- చెన్నై, నారాయణాద్రి, విశాఖ నిలుపుదలకు అంగీకారం
- గత రెండు పర్యాయాలు ఆరు నెలల గడువు విధింపు
- ఈ దఫా ఎలాంటి సమయాన్ని పేర్కొనకుండా ఉత్తర్వులు



గుంటూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చెన్నై, విశాఖ, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అమల్లో ఉన్న హాల్ట్‌లను పొడిగిస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీఆర్ఎం రామకృష్ణ తెలిపారు. కోవిడ్ సమయంలో సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి రైల్వేస్టేషన్లలో ఆయా రైళ్లకు నిలుపుదల సౌకర్యాన్ని ఎత్తేసింది. ప్రయాణికుల ఇబ్బందులను అప్పటి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు రైల్వే బోర్డుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఏడాది క్రితం ఆయా రైళ్లకు సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి రైల్వే స్టేషన్లలో స్టాపింగ్‌ను రైల్వేశాఖ అమల్లోకి తీసుకొచ్చింది. తొలుత ఆరు నెలల, ఆ తర్వాత మరో అర్థ సంవత్సరం పాటు ఆయా స్టేషన్లలో మూడు రైళ్లకు నిలుపుదలని కల్పించింది. ఆరు నెలల క్రితం పొడిగించిన గడువు తేదీ సమీపించడం, మరి కొంతకాలం/శాశ్వతంగా హాల్ట్‌లను అమలు చేసే విషయంలో రైల్వే శాఖ నిర్ణయాన్ని ప్రకటించే విషయంలో రైల్వే శాఖ కాస్త జాప్యం చేసింది. బుధవారం సాయంత్రం వరకు కూడా వచ్చే సోమవారం నుంచి ఈ మూడు రైళ్లకు రిజర్వేషన్ సిస్టమ్‌లో గుంటూరు తర్వాత సికింద్రాబాద్ స్టేషన్ మాత్రమే కనిపించింది. అయితే ప్రయాణికుల విజ్ఞప్తుల మేరకు పొడిగింపు నిర్ణయాన్ని రైల్వే బోర్డు బుధవారం రాత్రికి ప్రకటించింది. ఈ ప్రకారం గుంటూరు నుంచి సికింద్రాబాద్ వైపునకు వెళ్లే చెన్నై, నారాయణాద్రి, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లకు ఈ నెల 21 నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి రైల్వేస్టేషన్లలో నిలుపుదల సౌకర్యం కొనసాగుతుంది.

### మరికొన్ని రైళ్లకు..

నెంబరు.17232 నాగర్‌సోల్ - నరసపూర్ ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 22 నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడిలో, నెంబరు. 17625 కాచీగూడ - రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 21 నుంచి వేజండ్లలో, నెంబరు. 17216 ధర్మవరం - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌కి గిద్దలూరు, మార్కాపురం రోడ్డులో, నెంబరు. 17256 హుబ్లీ-నరసపూర్ మంగళగిరిలో, నెంబరు.17643 సర్కార్ ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 23 నుంచి మంగళగిరి, న్యూగుంటూరులో నిలుపుదల సౌకర్యాన్ని కొనసాగించనున్నట్లు డీఆర్ఎం ప్రకటించారు. చెన్నై, నారాయణాద్రి, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లకు నల్గొండ, మిర్యాలగూడ లోనూ నిలుపుదలని కొనసాగిస్తామన్నారు.

# దిక్సూచి
DIKSUCHI

## లా కోర్సులలో ప్రవేశానికి క్లాట్



దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ లా యూనివర్సిటీలలో ప్రవేశానికి ఉద్దేశించిన 'కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్) 2025' దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. దీని ద్వారా అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ లా ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ టెస్ట్‌ను 'కన్సార్షియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీస్' నిర్వహిస్తుంది. హైదరాబాద్ నల్సార్, విశాఖపట్నం డీఎస్ఎన్ఎల్‌యూ సహా బెంగళూరు ఎన్ఎల్ఎస్ఐయూ, భోపాల్ ఎన్ఎల్ఐయూ, కొచ్చి ఎన్‌యూఏఎల్ఎస్, జోధ్‌పూర్ ఎన్ఎల్‌యూ, ఒడిశా ఎన్ఎల్‌యూఓ తదితర లా కళాశాలలు ఇందులో పార్టిసిపేట్ చేస్తున్నాయి. క్లాట్ 2025లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థుల చాయిస్‌ను అనుసరించి సీట్లను అలాట్ చేస్తారు. ఈ ఎగ్జామ్‌ను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

**అండర్ గ్రాడ్యుయేట్:** ఇది అయిదేళ్ల వ్యవధి గల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్. గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. 2025 మార్చి/ఏప్రిల్‌లో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే.


**యూజీ క్లాట్ 2025:** ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇంగ్లీష్‌లో 22 నుంచి 26 ప్రశ్నలు; కరెంట్ అఫైర్స్-జనరల్ నాలెడ్జ్‌లో 28 నుంచి 32 ప్రశ్నలు; లీగల్ రీజనింగ్‌లో 28 నుంచి 32 ప్రశ్నలు; లాజికల్ రీజనింగ్‌లో 22 నుంచి 26 ప్రశ్నలు; క్వాంటిటేటివ్ టెక్నిక్స్‌లో 10 నుంచి 14 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 120. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

**పోస్ట్ గ్రాడ్యుయేట్:** ఇది ఏడాది వ్యవధి గల ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్. ద్వితీయ శ్రేణి మార్కులతో ఎల్ఎల్‌బీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. 2025 ఏప్రిల్/మేలో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

**పీజీ క్లాట్ 2025:** ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. కాన్‌స్టిట్యూషనల్ లా, జ్యూరిస్ప్రుడెన్స్, అడ్మినిస్ట్రేటివ్ లా, లా ఆఫ్ కాంట్రాక్ట్, టార్ట్స్, ఫ్యామిలీ లా, క్రిమినల్ లా, ప్రాపర్టీ లా, కంపెనీ లా, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, ట్యాక్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా, లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లా అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 120. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు. కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **క్లాట్ 2025 తేదీ:** డిసెంబరు 1
- **వెబ్‌సైట్:** www.consortiumofnlus.ac.in

## ఓయూలో పార్ట్ టైమ్ పీజీ



హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తున్న యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (యూసీఈ)-పార్ట్ టైమ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీఈఈపీ) కింద ఎంఈ/ఎంటెక్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నారు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించిన ఈ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. సివిల్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, బయో మెడికల్, మైనింగ్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ఇంజనీరింగ్ విభాగంలో 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు.

**అర్హతలు:** స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్/ఏఎంఐఈ/ఏఎంఐఈటీఈ ఉత్తీర్ణులై ఉండాలి. జూన్ 30 నాటికి కనీసం ఏడాది అనుభవం ఉండాలి. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి ఏదేని ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులు; మాస్టర్స్ డిగ్రీ(ఫిజిక్స్/స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/జియో ఫిజిక్స్) పూర్తిచేసినవారు; ఎమ్మెస్సీ(కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు; ఎంసీఏ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. బయో మెడికల్ ఇంజనీరింగ్ విభాగానికి(బీఈ/బీటెక్)( బయో మెడికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఈఐఈ/ఈసీఈ/బయోటెక్నాలజీ/మెడికల్ ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు; ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/మెడికల్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్/మెడికల్ ఫిజిక్స్/బయో ఫిజిక్స్/బయో ఇన్ఫర్మాటిక్స్/బయో మెడికల్ ఇన్ఫర్మాటిక్స్/బయోటెక్నాలజీ) పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. మైనింగ్ ఇంజనీరింగ్ విభాగానికి మైనింగ్ అండ్ మెషినరీ ఇంజనీరింగ్/మైనింగ్ ఇంజనీరింగ్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 14
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఆగస్టు 25
- **వెబ్‌సైట్:** www.uceou.edu

## డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్

న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ పర్మనెంట్ వే ఇంజనీర్స్(ఇండియా)- డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ఇది కరస్పాండెన్స్ కోర్సు. ఇందులో ఇండియన్ రైల్వేస్‌కు సంబంధించిన స్ట్రక్చర్, ఫంక్షనింగ్ అంశాలు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌నకు కోల్‌కతాలోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) గుర్తింపు ఉంది.

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి సైన్స్/కామర్స్/ఇంజనీరింగ్ విభాగాల్లో బీఎస్సీ/బీకామ్/బీఈ ఉత్తీర్ణులు; ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో మూడేళ్ల డిప్లొమా ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్/సైన్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఏ డిగ్రీ పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** ipweindia.org.in

**'దిక్సూచి' వెబ్ పేజీలో..**
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/1ZB524Mలో చదవండి.



## ప్రేక్షకులు గుర్తుపెట్టుకునే సినిమా



ఇటీవలే 'ఓమ్ భీమ్ బుష్' చిత్రంతో ప్రేక్షకులను పలకరించారు ప్రియదర్శి. ఆయన, నభానటేశ్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'డార్లింగ్'. 'వై దిస్ కొలవెరీ' అనేది ఉపశీర్షిక. అశ్విన్‌రామ్ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. సినిమా రేపు విడుదలవుతోన్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు.

"దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు చాలా బాగా నచ్చింది. స్క్రిప్ట్‌పై పూర్తి నమ్మకం ఉంది. సినిమాకు ఈ టైటిల్‌ను చాలా ప్రేమతో పెట్టాం. కపుల్స్ మధ్య జరిగే సంఘటనలని వినోదాత్మకంగా చూపించే ఈ సినిమా.. రిలేషన్‌షిప్‌లో ఉన్న వారితో పాటు అన్ని వర్గాలనూ ఆకట్టుకుంటుంది. ఇందులో నా ప్రపంచం, నభా ప్రపంచం చాలా వేరుగా ఉంటాయి. భిన్న ధృవాలైన మా ఇద్దరి మధ్య సీరియస్‌గా జరిగే సంఘటనలతో సాగే సన్నివేశాలను ప్రేక్షకులు ఫుల్‌గా ఎంజాయ్ చేస్తారు. స్క్రీన్‌ప్లే చాలా వైవిధ్యంగా ఉంటుంది. 'డార్లింగ్' సినిమాను అందరూ చాలా కాలం గుర్తుపెట్టుకుంటారు" అని ప్రియదర్శి అన్నారు.

## ఆగస్టులో భవనమ్ విడుదల



ప్రతిష్ఠాత్మక నిర్మాణసంస్థ సూపర్‌గుడ్ ఫిలిమ్స్ నిర్మిస్తున్న తాజా చిత్రం 'భవనమ్'. 'ది హాంటెడ్ హౌస్' అనేది ఉపశీర్షిక. ఆర్‌బీ చౌదరి, వాకాడ అంజన్‌కుమార్, వీరేంద్ర సిర్వీ నిర్మిస్తున్నారు. సప్తగిరి, ధన్‌రాజ్, షకలక శంకర్, అజయ్, మాళవిక సతీషన్, స్నేహా ఉల్లాల్ ప్రధాన తారాగణం. బాలాచారి కూరెళ్ల దర్శకత్వం వహిస్తున్నారు. బుధవారం మేకర్స్ 'భవనమ్' విడుదల తేదీని ప్రకటించారు. ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌ను ఆగస్టు 9న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు తెలిపారు. ప్రేక్షకుల్ని భయపెట్టడంతో పాటు మంచి హాస్యంతో అలరిస్తుందని చిత్ర బృందం తెలిపింది. సినిమాటోగ్రఫీ: మురళీమోహన్‌రెడ్డి, ఎడిటర్: ఎస్బీఆర్.

## 'ఏం చేద్దామంటావ్ మరి'...
## కల్లు కాంపౌండ్ పాటలో కేసీఆర్ ఊతపదం



● దర్శకుడు పూరి జగన్నాథ్‌పై కేసు నమోదు

రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమా నుంచి ఇటీవలే విడుదలైన 'మార్ ముంత చోడ్ చింత' అనే పాటలో మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు వాయిస్‌ను ఉపయోగించడంపై బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు అభ్యంతరం తెలుపుతున్నారు. కల్లు కాంపౌండ్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ గీతంలో 'ఏం చేద్దామంటావ్ మరి' అనే కేసీఆర్ పాపులర్ డైలాగ్‌ను రెండుసార్లు ఉపయోగించారు. వెంటనే పాట నుంచి ఆ హుక్‌లైన్‌ను తొలగించేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు ఎం. రజితారెడ్డి, జీ. సతీష్‌కుమార్ బుధవారం ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. 'పదేళ్ల తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్ వాయిస్‌ను కల్లు కాంపౌండ్‌లో చిత్రీకరించిన ఐటమ్ సాంగ్‌లో ఉపయోగించడం తప్పు, ఇది కేసీఆర్‌ను అవమానించడమే కాక తెలంగాణ ప్రజల మనోభావాలనూ దెబ్బతీసేలా ఉంది' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. 'మా ప్రాంత యాస, భాష, మా నాయకుడిని కించపరిచినా సహించేది లేదు, అవసరమైతే పూరి జగన్నాథ్ ఇంటిని ముట్టడిస్తామ'ని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. పాట రచయిత కాసర్ల శ్యామ్, సింగర్ రాహుల్ సిప్లిగంజ్‌పైనా సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ విమర్శలపై చిత్రబృందం ఇంతవరకూ స్పందించలేదు.

## త్వరలోనే మీ ముందుకొస్తా



నటించిన అతికొద్ది చిత్రాలతోనే తన సూపర్ యాక్టింగ్‌తో.. మంచి టైమింగ్‌తో నటుడిగా స్పెషల్ ఇమేజ్ తెచ్చుకున్నారు నవీన్ పొలిశెట్టి. 2023లో విడుదలైన 'మిస్.శెట్టి, మిస్టర్ పొలిశెట్టి' చిత్రం తర్వాత ఆయన తెరపై కనిపించలేదు. ఈ విరామానికి గల కారణాన్ని ఆయన సోషల్ మీడియాలో షేర్ చేశారు.

"నేను మీ అందరితో ఓ వ్యక్తిగత విషయాన్ని పంచుకోవాలనుకుంటున్నాను. నేను చేస్తున్న సినిమాల గురించి అప్‌డేట్స్ లేవని అందరూ అడుగుతున్నారు. దానికి కారణం ఇటీవలే జరిగిన బైక్ ప్రమాదంలో నా చేతికి, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ గాయాల వల్లే నేను సినిమాలను అనుకున్న టైమ్‌కి మీ ముందుకు తీసుకురాలేకపోతున్నాను. ఈ విరామానికి నన్ను క్షమించండి. త్వరలోనే పూర్తిగా కోలుకుని మిమ్మల్ని తిరిగి ఎంటర్టైన్ చేస్తాను" అని పేర్కొన్నారు.

## 'సర్దార్-2' షూటింగులో స్టంట్‌మేన్ మృతి



తమిళ నటుడు కార్తీ హీరోగా నటిస్తున్న 'సర్దార్-2' చిత్రం షూటింగ్‌లో విషాదం చోటు చేసుకుంది. ఈ సినిమా కోసం ఒక ఫైట్ చిత్రీకరిస్తుండగా, 20 అడుగుల ఎత్తు నుంచి ఫైట్ ట్రైనర్ (స్టంట్‌మేన్) ఏళుమలై ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయాన్ని ఆ చిత్ర నిర్మాణ సంస్థ ప్రిన్స్ పిక్చర్స్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక సాలిగ్రామంలోని ప్రసాద్ స్టూడియోలో మంగళవారం ఫైట్ మాస్టర్ సూపర్ సుబ్బరాయన్ పర్యవేక్షణలో ఫైట్ రిహార్సల్ చేస్తుండగా ఈ సంఘటన జరిగింది. ఏళుమలై కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని నిర్మాత లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

## ఆరోగ్యంగానే ఉన్నా

ఆర్.నారాయణమూర్తి



ప్రజానటుడు ఆర్.నారాయణమూర్తి స్వల్ప అస్వస్థతతో బుధవారం నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. ఆయనను ప్రత్యేక విభాగంలో ఉంచి నిమ్స్ డైరెక్టర్ బీరప్ప ఆధ్వర్యంలో వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు. గతంలో ఆయనకు ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగి ఉండటంతో హృద్రోగ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ పరీక్షలను వైద్యులు చేసి, ప్రమాదం ఏమీ లేదని నిర్ధారించారు. గ్యాస్ట్రిక్ సమస్య అయి ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. నారాయణమూర్తికి ఏమైందంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతుండడంతో 'నేను ఆరోగ్యంగా ఉన్నా. అభిమానులూ ఆందోళన చెందకండి. దేవుడి దయ వల్ల బాగానే ఉన్నా. పూర్తిగా కోలుకున్న తర్వాత అన్ని వివరాలూ వెల్లడిస్తా' అని ఓ ప్రకటనలో తెలిపారు నారాయణమూర్తి.



తన భర్త నికోలై సచ్‌దేవ్‌తో కలసి వరలక్ష్మి బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో ముచ్చటించారు. 'హైదరాబాద్ నాకు సెకండ్ హోమ్.. మీరంతా నాకు చాలా సపోర్ట్ చేశారు. ఇక ముందు కూడా ఇలానే సహకరించాలి' అని కోరారు వరలక్ష్మి

## 'బడ్డీ' వచ్చేది ఎప్పుడంటే..!



అల్లు శిరీష్ హీరోగా నటిస్తున్న 'బడ్డీ' చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదల కోసం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. అడ్వెంచరస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో గాయత్రీ భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లు. శామ్ ఆంటోనీ దర్శకుడు. ఈ చిత్రాన్ని ఆగస్టు 2న విడుదల చేయనున్నట్లు నిర్మాతలు జ్ఞానవేల్ రాజా, అధన చెప్పారు. ఈ చిత్ర నిర్మాణం ఇండియన్ సిల్వర్ స్క్రీన్ మీద కొత్త ప్రయత్నం అని వారు చెప్పారు. సంగీత దర్శకుడు హిప్ హాప్ తమిళ స్వరపరిచిన పాటలు మంచి ఆదరణ పొందాయని చెప్పారు.

## టికెట్ రేట్లు తగ్గించాలి



వినోద్ కిషన్, అనూష కృష్ణ జంటగా రూపుదిద్దుకున్న 'పేక మేడలు' చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతోంది. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రాకేశ్ వర్రె నిర్మించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో చిత్రాన్ని విడుదల చేస్తున్న నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'పెద్ద సినిమాల టికెట్ రేట్లు ఎంత ఉన్నా ప్రేక్షకులు థియేటర్‌కు వస్తారు. ఇలాంటి చిన్న సినిమాలకు తక్కువ రేట్లు ఉండాలి. అందుకే టికెట్ రేటు వంద రూపాయలు పెట్టాం. ఇలాంటి మంచి సినిమాను ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలని పెయిడ్ ప్రీమియర్స్ కు రూ 50 పెట్టాం. సినిమా బాగుందని ప్రతి ఒక్కరూ చెప్పారు. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది' అని చెప్పారు. చిత్ర నిర్మాత రాకేశ్ వర్రే మాట్లాడుతూ 'ఈ సినిమా విడుదల చేయడానికి ముందుకు వచ్చిన ధీరజ్‌కు ధన్యవాదాలు. అలాగే మా సినిమాకు సపోర్ట్ చేసిన రానా దగ్గుబాటి, అడవి శేష్, విష్వక్‌సేన్‌కు కృతజ్ఞతలు' అన్నారు. పెయిడ్ ప్రీమియర్స్‌కు వస్తున్న రెస్పాన్స్ చూసి చాలా ఆనందంగా ఉందని వినోద్ కిషన్ చెప్పారు.

# ల్యాండ్ టైటిల్లింగ్ యాక్ట్ రద్దు హర్షణీయం

- రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ప్రజారంజక పాలన ప్రారంభం
- సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూలై 17: ల్యాండ్ టైటిల్లింగ్ యాక్ట్ రద్దు బిల్లుకు మంత్రి వర్గం ఆమోదం తెలపటం హర్షణీయమని సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా ల్యాండ్ టైటిల్లింగ్ యాక్ట్ రద్దు బిల్లును మంత్రివర్గం ఆమోదించిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేను ప్రభుత్వం నిలిపి వేయటంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలోని వ్యవస్థలను చిన్నాభిన్నం చేసి ఆర్థిక విధ్వంసానికి పాల్పడిందని, ఆ సంక్షోభ భారాలను తట్టుకొని కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి అజెండాలతో ముందుకు వెళుతూ ఎన్నికల హామీల అమలు దిశగా పయనిస్తుందన్నారు. పనిచేస్తున్న ప్రభుత్వంపై కొంత మంది వైసీపీ నేతలు తప్పుడు ఆరోపణలు చేయటం మానుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఇసుక విధానంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వ ఇసుక విధానంతో భవన నిర్మాణ కార్మికులు రోడ్డునపడి ఆత్మహత్యలు చేసుకున్నారన్న విషయాన్ని కన్నా గుర్తుచేశారు. ఆగస్టు 15 నుంచి అన్నక్యాంటీన్‌ల సేవలు ప్రారంభం కానున్నా యన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు.పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలు కూడా ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు. నియోజక వర్గ ప్రజలకు కన్నా లక్ష్మీనారాయణ తొలి ఏకాదశి, మొహరం శుభాకాంక్షలు తెలిపారు.

# ఆర్టీసీ కార్మికులను మోసం చేసిన జగన్‌రెడ్డి

- చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుని సత్కరిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

చిలకలూరిపేట అర్బన్, జూలై 17 : ఆర్టీసీ కార్మికులను మాజీ సీఎం జగన్‌రెడ్డి నమ్మించి మోసం చేశాడని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం చిలకలూరిపేట ఆర్టీసీ డిపో ఉద్యోగ సంఘాల నేతలు ఎమ్మెల్యే ప్రత్తిపాటిని మర్యాద పూర్వకంగా కలసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారితో ఎమ్మెల్యే ప్రత్తిపాటి మాట్లాడుతూ.. విలీనం పేరిట ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల హక్కులను, ప్రయోజనాలను కాలరాసివేసి వారు కోలుకోలేని విధంగా దెబ్బతీసిన దుర్మార్గుడు జగన్ అని మండిపడ్డారు. సంక్షోభంలో కూరుకుపోయిన ఆర్టీసీకి పునర్జీవింప చేయటం కోసం కూటమి ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. కొత్త బస్సుల కొనుగోలు, సర్వీసుల పెంపు, కార్మికుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ప్రణాళికతో ఉన్నారని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్టీసీ మరింత ఆదరణ, ఆదాయం రెండు పెరుగుతాయన్నారు. 2019 ఎన్నికల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తానని హామి ఇచ్చిన జగన్ పేరుకు చేసినా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అన్ని ప్రయోజనాలు కల్పించ లేదు సరి కదా ఆర్టీసీలో ఉన్నప్పుడు వారు పొందిన అనేక సదుపాయలకు కోత విధించారని మండి పడ్డారు. బకాయిలను చెల్లించ లేదని, విలీనం జరిగి ఏళ్ళు గడుస్తున్నా వారికి ఏ పింఛన్ ఇస్తారో చెప్పలేదని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఆ సమస్య లన్నీ పరిష్కరించాల్సి ఉందన్నారు.



# ప్రజా దర్బార్‌కు విన్నపాల వెల్లువ

- 17వ రోజు వెల్లువెత్తిన ప్రజానీకం
- వినతులు స్వీకరించి పరిష్కరిస్తానన్న మంత్రి లోకేశ్


దివ్యాంగుల నుండి అర్జీలు స్వీకరిస్తున్న నారా లోకేశ్

తాడేపల్లి, జూలై 17: రాష్ట్ర మంత్రి, యువనేత నారా లోకేశ్ ప్రవేశ పెట్టిన ప్రజాదర్బార్‌కు బుధవారం అర్జీదారులు వెల్లువెత్తారు. కరకట్ట ఆసాంతం అర్జీదారులతో నిండిపోయింది. 17వ రోజు బుధ వారం పలువురు తమ అర్జీలను నారా లోకేశ్‌కు అంద జేసి సమస్యలు పరిష్కరించాలని విన్నవించగా లోకేశ్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సైతం ప్రజలు భారీగా విచ్చేశారు.

**బోధన, బోధనేతర ఉద్యోగులకు టైమ్ స్కేల్ వర్తింపజేయాలి**

ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ మిని గురుకులాల్లో పని చేస్తున్న బోధన, బోధనేతర ఉద్యోగులకు టైమ్ స్కేల్ వర్తింపజేయాలని సిబ్బంది లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గ్రామ సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న తమకు విపరీతమైన పని భారం పెరిగి ఇబ్బందులు పడుతున్నామని తగినన్యాయం చేయాలని సెక్రటరియేట్ ఇంజనీరింగ్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఐటి మేనేజర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు, డీఈవోలు ఆఫీస్ సబార్డినేట్లకు కాంట్రాక్టు పద్ధతి వర్తింపజేయాలని సిబ్బంది కోరారు.

**ప్రేమ వివాహం చేసుకున్న కుమారుడిని హత మార్చారు..**

ప్రేమ వివాహం చేసుకున్న తమ కుమారుడిని గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతల అండతో యువతి కుటుంబం కిరాతకంగా హతమార్చారని, తగిన న్యాయం చేయాలని మంగళగిరి మండలం నవులూరుకు చెందిన సత్తెనపల్లి రామాంజనేయులు మంత్రి లోకేశ్‌ను కలిసి కన్నీటిపర్యంతమయ్యారు. గుంటూరు లోని ప్రైవేటు ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్‌గా పనిచేస్తున్న తన కుమారుడు సత్తెనపల్లి సీతారామాంజనేయులు పాకనాటి స్వాతి ప్రేమ వివాహం చేసుకున్నారు. అది ఇష్టంలేని యువతి తండ్రి శ్రీనివాసరెడ్డి వారి కుటుంబసభ్యుల సాయంతో కిరాతకంగా హత్యచేశాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు విన్న మంత్రి లోకేశ్ పరిశీలించి తగిన చర్య తీసుకుంటామన్నారు.

**గల్లా జయదేవ్ కాలనీవాసుల వినతి**

మంగళగిరి పట్టణం ఇప్పటం రోడ్డులోని గల్లా జయదేవ్ కాలనీ వాసులు మంత్రి లోకేశ్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించారు. కాలనీలో 80 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తాగునీరు సక్రమంగా అందడం లేదని డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేక మురుగు నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న సీసీరోడ్ల నిర్మాణం పూర్తిచేయాలని కోరారు. నూతన పెన్షన్లతో పాటు గత ప్రభుత్వం తొలగించిన రేషన్ కార్డులు, వృద్ధాప్య, వితంతు పింఛన్లు పునరుద్ధరించాలని మంగళగిరి నియోజకవర్గంకు చెందిన పలువురు విజ్ఞప్తి చేశారు. వినతులు స్వీకరించిన లోకేశ్ వారి సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



మంత్రి నారా లోకేశ్‌కు అర్జీలు అందిస్తున్న ప్రజలు

# వాస్తవాలు తెలిపేందుకే శ్వేతపత్రాలు

- ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవస్థలు అస్తవ్యస్తం
- వేల కోట్ల రూపాయలు దోచుకున్న వైసీపీ నేతలు
- గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు


గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జూలై 17: ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు, దోపిడీలపై ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు సీఎం చంద్రబాబునాయుడు శ్వేత పత్రాలు విడుదల చేయడం జరిగిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ పాలకులు ఏ విధంగా అక్రమాలు, దందాలుచేసి ఎంత దోచుకున్నారో ఆధారాలతో సహా శ్వేతపత్రాలలో బయట పెడుతున్నార న్నారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో దాదాపు 1.75 లక్షల ఎకరాల భూ ఆక్రమణలు జరిగాయని, వాటివిలువ 33,576 కోట్లపైనే వుంటుందని, ఇళ్ల పట్టాల పేరుతో 10వేల ఎకరాలు, ఇసుక దందాలో 9,750 కోట్లు వైసీపీ నేతలు అక్రమంగా దోచుకున్నారని ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జీవో 512ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేయడం జరిగిందని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో వైసీపీ నేతలు భూదోపిడికి పాల్పడేందుకు కుట్ర పన్నారన్నారు. తక్కువ ధరకు రైతుల నుండి భూములు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ప్రభుత్వానికి అమ్మిన వైసీపీ నేతల భాగోతాల గురించి సాక్షాదారాలతో సహా శ్వేతపత్రంలో పొందుపరచడం జరిగిందన్నారు. విశాఖలో రామానాయుడు స్టూడియో భూములను, వృద్ధాశ్రమానికి ఇచ్చిన హాయగ్రీవ భూములను తిరుపతి, రేణిగుంట సమీపంలోని మఠం భూములను, పుంగనూరులో 982 ఎకరాలను వైసీపీ నేతలు కొట్టేశారన్నారు. దస్పల్లా భూములను సైతం కొట్టేసి ఇల్లు కట్టుకున్నారని, చిత్తూరులో 782 ఎకరాలు, ఒంగోలులో నకిలీ పత్రాలతో 101 కోట్ల ఆస్తిని కాజేసేందుకు వైసీపీ నేతలు యత్నించే ప్రయత్నంచేశారని, వీటిపై విచారణ జరుపుతామని యరపతినేని తెలిపారు. 13,800 ఎకరాల అవ భూములను వైసీపీ నేతలకు ధారాదత్తం చేశారని, తక్కువ ధరకు 40వేల ఎకరాలు కొని అధికారులను బెదిరించి ఆ భూములకు పట్టాలు తెప్పించుకున్నారని, రుషికొండలో 500 కోట్లతో ప్యాలెస్ కట్టి ప్రజాధనాన్ని వృధాచేశారని, భూహక్కు పత్రం పేరుతో ప్రచారానికి 13 కోట్లు వైసీపీ ప్రభుత్వం ఖర్చుచేసిందని, వైసీపీ కార్యాలయాల కోసం ప్రతి జిల్లాలో 2ఎకరాలు చొప్పున నామ మాత్రపు లీజుగుతో 33 ఏళ్ల లీజు పొందారని, మొత్తం 300 కోట్ల విలువైన భూమిని కేటాయించుకున్నారన్నారు. కొండలను సైతం జగన్‌రెడ్డి ప్రభుత్వం అనకొండలా మింగేశారని, ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ఎమ్మెల్యేలే అక్రమంగా భూగర్భ వనరులను తవ్వేశారన్నారు. వైసీపీ నేతలు ఇసుకాసురల అవతార మెత్తి ఇసుకను మింగి వందలాది టిప్పర్ల ఇసుకను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలి స్తున్నా పట్టించుకోకపోవడంతో కోట్లాది మంది భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువైందన్నారు. నూతన ఇసుక విధానంతో ఉచిత ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడంతో భవననిర్మాణ కార్మికులు, వారి కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు.

## ఆర్వీఆర్‌జేసీలో నూరుశాతం సీట్లు భర్తీ

- కంప్యూటర్‌తో పాటు, సంప్రదాయ కోర్సులకు డిమాండ్

గుంటూరు(విద్య),జులై 17: ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లు భర్తీ కోసం ఉన్నత విద్యామండలి నిర్వహించిన ఏపీఈఏపీసెట్ కన్వీనర్ కోటా వెబ్‌కౌన్సిలింగ్‌లో ఆర్వీఆర్‌జేసీలోని అన్నిబ్రాంచీల సీట్లు నూరు శాతం భర్తీ అయ్యాయని ఈ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కే.మద్దినేనిలు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కంప్యూటర్ కోర్సులైన సీఎస్ఇ, సీఎస్ఎం, సీఎస్‌డి,ఐటీ, సీఎస్‌బీ, సీఎస్‌వో, ఈసీఈ తోపాటు సంప్రదాయ కోర్సులైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్ ఇంజనీరింగ్ బ్రాంచీలకు డిమాండ్ ఏర్పడిందని, ఆయా బ్రాంచీల్లో సైతం సీట్లు నూరుశాతం భర్తీ అయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తెలిపారు.


రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

## 10 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరుటౌన్, జూలై17: పేదలకు దక్కాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని రూరల్ పోలీసులు బుధ వారం అర్ధరాత్రిస్వాధీనం చేసుకున్నారు. రూరల్‌పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బ్రహ్మణకోడూరు అడ్డరోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా వెళ్ల తున్న లారీని ఆపి సోదాలు నిర్వహించారు. ఈ లారీలో పది టన్నుల రేషన్ బియ్యం బస్తాలను గుర్తించి వాహనంలో ప్రయాణీస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రేషన్ బియ్యం కొల్లూరు నుంచి గుంటూరు వెళ్లతునట్లుగా అధికారులు అనుమానిస్తున్నారు. బియ్యం లారీని స్వాధీనం చేసుకోవటంతోపాటు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై భార్గవ్ వెల్లడించారు.


అఖండ జ్యోతిని వెలిగించిన ఎంపీ శ్రీ కృష్ణదేవరాయులు, ఎస్పీ కే.శ్రీనివాస రావు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు తదితరులు

## వైభవంగా రామలింగేశ్వరస్వామి తిరునాళ్ల

- ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి భక్తుల రాక

వినుకొండ టౌన్, వినుకొండ, జూలై 17: తొలి ఏకాదశి పండుగ సందర్భంగా వినుకొండ కొండపై రామలింగేశ్వరస్వామి తిరునాళ్ల మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హిమాలయ గురువు ఆధ్వర్యంలో చేపట్టిన హోమాల్లో పాల్గొన్నారు. శాంతి ఆశ్రమ ట్రస్ట్ వ్యవస్థాపకులు హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో కొండపై అఖండజ్యోతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు, సాయంత్రం 6.30 నిమిషాలకు అఖండజ్యోతిని ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు, పల్నాడు జిల్లా ఎస్పీ కే.శ్రీనివాసరావు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు చేతుల మీదుగా హిమాలయ గురూజీ వెలిగించారు.

## పశ్చిమడెల్టాకు 2519 క్యూసెక్కులనీరు

దుగ్గిరాల, జూలై 17: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 2519 క్యూసెక్కుల సాగునీటిని బుధవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 611 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 135 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 1393 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

# త్రిపురాపురం కొండపై మట్టి మైనింగ్

- అడ్డుకున్న తహసీల్దార్, పోలీసులు
- ఒక ప్రొక్లెయినర్, రెండు ట్రాక్టరులు స్వాధీనం

నకరికల్లు, జూలై 17 : ప్రభుత్వ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే కొందరు అక్రమార్కులు యదేచ్ఛగా మట్టి మైనింగ్‌కి పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. నకరికల్లు మండలం త్రిపు రాపురం గ్రామ సమీపాన అద్దంకి -నార్కెట్‌పల్లి ప్రధాన రహదారికి సమీపాన ఉన్న కొండ మట్టిని కొల్లగొట్టి అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. బుధవారం నకరికల్లుకు చెందిన ఒక వ్యక్తి అక్రమ మైనింగ్‌కి సంబంధించిన ఫోటోలు తీసి తహసీల్దార్, ఆర్డీవో, ఇతర అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన సత్తెనపల్లి ఆర్డీవో వీ.మురళీకృష్ణ అక్రమంగా మైనింగ్ చేస్తున్న వాహనాలను, అందుకు కారకులను తక్షణమే అందుపులోకి తీసుకోవాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణకు, పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. వెంటనే తహసీల్దార్ లక్ష్మీనారాయణ పోలీసు అధికారులతో కలసి త్రిపురా పురం కొండ వద్దకు చేరుకొని అక్రమ మైనింగ్‌ను అడ్డుకున్నారు. ఒక ప్రొక్లైనర్, 2 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ మైనింగ్‌లో అక్రమార్కుల పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెల్లడి కావాల్సి ఉంది.


మైనింగ్ చేస్తున్న ప్రాంతానికి వెళ్లి అడ్డుకున్న తహసీల్దార్ ఎల్ లక్ష్మీనారాయణ, పోలీసులు అధికారులు


మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు


విద్యార్థులకు స్కాలర్‌షిప్పుల చెక్కులను పంపిణీ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ లీలావతి, సాయిరామ్ తదితరులు

# విద్య ద్వారానే సమాజాభివృద్ధి

- పేద విద్యార్థుల విద్యోన్నతికి స్వచ్ఛంద సంస్థలు చొరవ చూపాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి
- 1600 మందికి రూ.50 లక్షల విలువైన మెరిట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ

గుంటూరు, జూలై 17: విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి తెలిపారు. పెదపలకలూరులో యేరువ కోటిరెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు బుధవారం 1600 మంది విద్యార్థులకు రూ.50 లక్షల విలువైన మెరిట్ స్కాలర్‌షిప్స్ పంపిణీ చేశారు. సీనియర్ న్యాయవాది పోలూరి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బు సంపాదించే వారిలో ఎక్కువ మంది ఆస్తులు పెంచుకునేందుకు ఆలోచన చేస్తుంటారని, కానీ ఇలా సమాజం కోసం డబ్బువెచ్చించే వాళ్ళు చాలా అరుదుగా ఉంటారన్నారు. పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం యేరువ కోటిరెడ్డి ఎడ్యుకేషనల్ ఆధ్వర్యంలో స్కాలర్షిప్‌లు అందించడం స్ఫూర్తిదాయకమన్నారు. ప్రస్తుతం స్కాలర్‌షిప్పులు తీసుకునేవారు విద్యా, ఉపాధి రీత్యా ఉన్నత స్థానాలకు చేరుకొని తిరిగి స్కాలర్‌షిప్పులు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఉద్యోగ రీత్యా విదేశాల్లో స్థిరపడినప్పటికీ సొంత ఊరిలో విద్యాభివృద్ధి కోసం యేరువ సాయిరామ్ కృషి చేయడం అభినందనీయమన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ లీలావతి మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్ నియంత్రణకు తల్లితండ్రులు తగిన చొరవ చూపాలన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులే జాగ్రత్త వహించాలని సూచించారు. యేరువ కోటిరెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ యేరువ సాయిరామ్ మాట్లాడుతూ తన సొంతూరికి ఎంతో కొంత సాయం చేయాలన్న ఉద్దేశ్యంతోనే తన తండ్రి పేరు మీద ట్రస్ట్‌ని ఏర్పాటు చేశానన్నారు. పలకలూరు హైస్కూల్లో భవనం నిర్మించడంతో ఆరంభమైన స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం విరామం లేకుండా నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. మొత్తం 52 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూలుకి రూ. 36,000 చొప్పున, అలాగే డిగ్రీ, బీటెక్, మెడిసిన్ వివిధ రకాలైన కోర్సులు చేస్తున్న 500 మందికి ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున అందజేశామన్నారు. సుమారుగా 54 వేల డాలర్లు అంటే రూ.45 లక్షల ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. ఈ స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఇకపైనా కొనసాగిస్తామని వైకేఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మెంబర్ పోలూరు వెంకటరెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్ కళాశాల ప్రిన్సిపాల్ పాతూరి రాధిక, గుళ్ళపల్లి సుధీర్, నూనె గంగాధర్ రెడ్డి, యేరువ జగదీశ్వరి, యేరువ శ్రీవేణి, యేరువ శ్రీలలిత, పాల వరప్రసాద్, యేరువ రమణి పాల్గొన్నారు.


బాలిక కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

## బాలిక హత్య అమానుషం

- ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్
- గుంటూరులో బాలిక కుటుంబ సభ్యులకు పరామర్శ

పొన్నూరుటౌన్, జూలై17: బాలిక హత్య అమానుషమని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. ఇటీవల చేబ్రోలు కొత్తరెడ్డిపాడు గ్రామంలో హత్యకు గురైన బాలిక కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ గుంటూరులో కలిసి పరామర్శించారు. బాలిక శైలజ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఇలాంటి అమానీయ ఘటనలను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. ఆడబిడ్డలపై చోటుచేసుకుంటున్న అఘాయిత్యాలు అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇలాంటి ఘటనల్లో నిందితులు శిక్షించేందుకు హోం శాఖ ప్రత్యేక ఫోర్సును ఏర్పాటుచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తునట్లు తెలిపారు. బాలిక హత్య ఘటనలో నిందితుడిని అరెస్టుచేసి కఠినంగా శిక్షిస్తామని బాధిత కుటుంబానికి బరోసా కల్పించారు. బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. పోలీసు అధికారులతో మాట్లాడి నిందితుడిని త్వరగా అరెస్టు చేసేలా చూస్తామని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ వివరించారు. ఆయనతో పాటు టీడీపీ నేతలు ఉన్నారు.

## జిల్లా స్థాయిలో విత్తన నిఘా బృందాలు

- జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు సిటీ, జూలై 17 : నకిలీ విత్తనాలను ఆదిలోనే నిరోధించేందుకు జిల్లా స్థాయిలో విత్తన నిఘా బృందాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి' లో 'నకిలీ విత్తనాల ఖిల్లా' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ నేపథ్యంలో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో నకిలీ విత్తనాలు కట్టడి చేసేందుకు గుంటూరు జిల్లాలో అనేక చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ఎక్కడా నకిలీ విత్తనాల జాడ లేదని స్పష్టం చేశారు. ఆటోనగర్, మాంచెస్టర్ రోడ్డులో లూజు విత్తనాలు తీసుకు వచ్చి శుద్ధి చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణల్లో ఖచ్చితత్వం లేదన్నారు. గత రెండు సంవత్సరాలుగా ఈ జిల్లా నుండి విత్తనాలు కొనుగోలు చేసిన ఏ ఒక్క రైతు తను నకిలీలతో మోసపోయానని ఫిర్యాదు చేయలేదని తెలిపారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు అరికట్టేందుకు జిల్లా వ్యవసాయ యంత్రాంగం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఈ నెలలో రాష్ట్ర స్థాయి బృందాలు జరిపిన దాడుల్లో రూ.20 కోట్ల నకిలీ విత్తనాలు పట్టుబడలేదని తెలిపారు. రూ.8.91 లక్షల పత్తి, మిరప, వరి విత్తనాలు పట్టుబడ్డాయని అవి నకిలీవి కాదని, సరైన పత్రాలు, స్టాక్ బోర్డులు లేనందున వాటి అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశాలు జారీచేశామన్నారు. విత్తన నిబంధన చట్టం పాటించని రూ.24.41 లక్షల విత్తనాలను అమ్మకాలు నిలిపి వేయాలని ఆదేశించామన్నారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు జాడ కనపడితే జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెల్ కు ఫిర్యాదు చేయాలని, నేరుగా రాలేని పక్షంలో సెల్ నెంబర్:8331056914,8331057038 కి ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు.

## ట్రాన్‌ఫార్మర్లలో రాగి వైరు దొంగలింత

తుళ్లూరు, జులై 17: పొలాల్లో ఉన్న మూడు కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఉన్న రాగి వైరు దొంగలించిన విషయపై తుళ్లూరు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మల్కాపురం వాసి రైతు గద్దె చంద్ర శేఖర్ మందడం రెవెన్యూలో 6 ఎకరాలలో అరటి తోట సాగు చేస్తున్నారు. అందులో ఉన్న ట్రాన్స్ ఫార్మర్లలో రాగి వైరును దండగులు దొంగిలించారు. దీనిపై తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సీఐ-2 అనురాధ తెలిపారు.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 114, 122,133 |
| చికెన్ విత్ స్కిన్ | 216.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 226.00 |

# పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



ఎత్తిపోతల జలపాతం వీక్షిస్తున్న సందర్శకులు

## ఎత్తిపోతల వద్ద సందర్శకుల సందడి

మాచర్లటౌన్, జూలై 17: మాచర్ల మండలం తాళ్లపల్లి పంచాయతీ పరిధిలోని ఎత్తిపోతల జలపాతం వద్ద బుధవారం సందర్శకులు సందడి చేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఎత్తిపోతల జలపాతం వర్షపు నీటితో జలకళను సంతరించుకోవడం పర్యాటకులు ఆ ప్రాంతాలను వీక్షించారు. పర్యాటక శాఖాధికారులు వీక్షకుల కోసం గ్యాలరీలు ఏర్పాటు చేశారు.

## మూడు రైళ్లకు స్టాపింగ్ పాయింట్ ఇవ్వాలి..

● రైల్వే అధికారులను కోరిన ఎమ్మెల్యే యరపతినేని.. సానుకూలంగా స్పందన

పిడుగురాళ్ల జూలై 17: నారాయణద్రి, విశాఖ, చెన్నై ఎక్స్‌ప్రెస్‌లను ఈనెల జులై 19నుంచి పల్నాడుజిల్లా, గురజాల నియోజవర్గంలోని నడికుడి, పిడుగురాళ్ల రైల్వే స్టేషన్లలో స్టాపింగ్‌ను ఎత్తి వేస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటించారు. దీనిపై గురజాల ఎమ్మెల్యే యరపతి శ్రీనివాసరావు స్పందించి బుధవారం రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడారు. గురజాల నియోజకవర్గ ప్రజల ప్రయాణ, రవాణా అవసరాల దృష్ట్యా నడికుడి, పిడుగురాళ్లస్టేషన్‌లలో ఈ మూడు రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలని అధికారులను కోరారు. దీంతో రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించి, ఈనెల జులై 21 నుంచి యధావిధిగా పల్నాడుజిల్లా, గురజాల నియోజవర్గంలోని నడికుడి, పిడుగురాళ్ల రైల్వే స్టేషన్లలో నారాయణద్రి, విశాఖ, చెన్నై ఎక్స్‌ప్రెస్ లకు స్టాపింగ్ ఇస్తున్నామని యరపతినేని శ్రీనివాసరావుతో తెలిపారు.



పల్నాడు జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్ సంజీవరావు బుధవారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. పల్నాడు ప్రాంతంలో మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఎమ్మెల్యే యరపతినేనితో కలసి చర్చించారు. మత్స్యకారుల సంక్షేమం నిమిత్తం వారికి అందాల్సిన పథకాలను సక్రమంగా అందేలా చూడాలని సంజీవరావుకు యరపతినేని సూచించారు. ఆయన వెంట మత్స్యకార సొసైటీ అధ్యక్షులు హనుమంతరావు వున్నారు. - పిడుగురాళ్ల



గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ శ్రేణులు

## టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూకల దాడి

● పలువురికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

సత్తెనపల్లి, జూలై 17: పాత కక్షలు నేపథ్యంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు దాడి చేసి గాయపరిచిన సంఘటన మండలంలోని ధూళిపాళ్ల గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది గ్రామానికి చెందిన బొలమల ప్రభుదాసు గతంలో వైసీపీలో ఉండేవాడు. సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా కన్నా లక్ష్మీనారాయణ వచ్చిన దగ్గర నుంచి ఆయన టీడీపీలో చేరి చురుగ్గా పనిచేస్తున్నారు. ఈనేపథ్యంలో గ్రామంలో టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరించారు. ఇది మనసులో పెట్టుకున్న వైసీపీ కార్యక ర్తలు బుధవారం రాత్రి గ్రామంలోని టీడీపీ కార్యకర్తల గృహాలపై పడి కర్రలు, రాళ్లతో దాడి చేశారు ఈదాడిలో ప్రభుదాసు బొలమాల మార్కు, ఏడుకొండలు తిరుపతి రావు, బోలమాల లక్ష్మిలకు తీవ్ర గాయాలయ్యాయి స్థానికులు వారిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా విషయాలకు తరలించారు. గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు పేయల కిరణ్, సాగర్, సాయి, కాశీ, మాల కొండలు తోకల రామారావు, మొద్దు మేరీబాబు తదితరులు తమ గృహాలపై పడి దాడి చేసి గాయపరిచారని బాధితులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాపడిన వారు సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ధూళిపాళ్ల సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారిని టీడీపీ మండల అధ్యక్షుడు ఆళ్ల అమరేశ్వరరావు పరామర్శించారు.

## ఆలయాల్లో మహిళల ప్రత్యేక పూజలు

పిడుగురాళ్ల, జూలై 17: తొలిఏకాదశి పర్వదినాన్ని బుధవారం పలు శివాలయాల్లో వైభవంగా జరిగాయి. స్థానిక శివాలయం, భోళాలింగేశ్వరస్వామి దేవాలయం, వెంకటేశ్వరస్వామి దేవాలయం, షిరిడీ సాయిమందిర్ తదితర ఆలయాలలో తొలిఏకాదశివేడుకలు ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా గుత్తికొండ బిళంలో తొలి ఏకాదశిని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలోనూ భక్తులు పూజాకార్యక్రమాలు చేపట్టారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉచిత అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.



పురపాలక సంఘ కార్యాలయం వద్ద నిరుపయోగంగా ఉన్న ఈ ఆటోలు

## మూలనపడ్డ ఈ ఆటోలు..

● స్వచ్ఛభారత్ లక్ష్యం గాలికి.. ● విధుల్లో ఉన్నవి రెండు ఆటోలే..

సత్తెనపల్లి, జూలై 17 : పట్టణాన్ని పరిశుభ్రంగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ పేరిట ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. దీనిలో భాగంగా ఇరుకు వీధుల్లో సైతం చెత్త సేకరణ పకడ్బందీగా సాగాలనే ఉద్దేశంతో పురపాలక సంఘానికి తొమ్మిది ఈ ఆటోలను అందించారు. వాహనాలను ఇచ్చిన వాటికి డ్రైవర్లను నియమించ లేదు. మరో వైపు గత ప్రభుత్వం ఆటోల పై పార్టీ రంగులు వేయటంతో ఎన్నికల సమయంలో నిబంధనల కారణంగా వాటిని రోడ్ల పై తిప్పేందుకు వీలు పడ లేదు. ఇలా పలు కారణాలతో 9 ఆటోల్లో ఏడు ఆటోలు మూలకు చేరాయి. దీంతో రెండు ఆటోలు మాత్రమే పని చేస్తున్నాయి.

పట్టణంలోని 31 వార్డులకు రోజుకు 22 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ నుంచి ఒక్కొక్క ఆటోకు రూ.4.10 లక్షలు ఖర్చుచేసి జూన్ 2023న తొమ్మిది ఆటోలను ప్రారంభిస్తే ఏడు ఆటోలు మరమ్మత్తులు, వివిధ కారణాలతో మూలకు చేరాయి. అప్పట్లో రిజిస్ట్రేషన్ సమస్యతో పాటు చార్జింగ్ పాయింట్, ఆటోల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం లేక ఇబ్బందులు తలెత్తాయి. అలాగే వాహనాలను సరఫరా చేసిన సంస్థ డ్రైవర్లను నియమించ లేదు. దీంతో పురపాలక సంఘం నుంచి అదనంగా పది వేలు కేటాయించి రెండు ఆటోలకు మాత్రమే డ్రైవర్లను నియమించారు. వాహనాలను రోడ్డెక్కిస్తే ఎన్నికలు నిబంధనలు అమల్లోకి రావటంతో వైసీపీ రంగులు ఉన్నాయని మరమ్మత్తులకు గురైన ఆటోలను మూలకుచేర్చారు. నేటికి ఏడు ఆటోలు వినియోగంలోకి రాలేదు. కాంట్రాక్టర్లకు లక్షల రూపాయలు కట్టబెట్టాలనే ఉద్దేశంతోనే వీటిని హడావుడిగా రోడ్డెక్కిం చారనే ఆరోపణలు ఉన్నాయి. ఆటోలు నిరుయోగంగా ఉండటంతో చెత్త సేకరణ కష్టతరమవుతుంది. దీనిపై మునిసిపల్ కమిషనర్ షమ్మి మాట్లాడుతూ ఏడు ఆటోలు మరమ్మతులకు గురయ్యాయన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేయించాల్సి ఉందన్నారు. త్వరలోనే వాహనాలను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

# వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు



కపోతేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

● చేజర్ల కపోతేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు
● జిల్లాలోని వివిధ ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు
● ఉదయం 6 గంటల నుంచే క్యూలలో రద్దీ

నకరికల్లు, జూలై 17 : దక్షణ కాశీగా పేరొందిన చేజర్ల కపోతేశ్వరాలయానికి బుధవారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు పోటెత్తారు. కపోటేశ్వర స్వామి నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. గంటల తరబడి భక్తులు క్యూలైన్‌లలో నిల్చొని స్వామి వారిని దర్శించుకున్నారు. వేకువ జాము నుంచే భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి కపోతేశ్వర స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లలో బారులు తీరారు. స్వామి వారికి విశేష అభిషేకాలు చేశారు. కపోతేశ్వర స్వామి వారిని, గంగా భ్రమరాంభ పార్వతి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. శిబి-సేవ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. మండలంలోని పలు ఆలయాల్లోనూ భక్తులు తొలిఏకాదశి పూజలు నిర్వహించారు.

**మాచర్ల రూరల్:** మండలంలోని తాళ్లపల్లి గ్రామ పరిధిలోని ఎత్తిపోతలలో తొలిఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శ్రీమధుమతి సమేత దత్తాత్రేయస్వామి దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకుడు దత్తాత్రేయులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో సాంబశివరావు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**గురజాలటౌన్** : మండలంలోని దైదలో వేంచేసియున్న అమరలింగేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు తెల్లవారుజాము నుంచే స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు న్విహించారు.

వెల్దుర్తి: మండల పరిధిలో ఉప్పలపాడులో బుగ్గమల్లయ్యస్వామి, గొట్టిపాళ్లలో మార్కండేయస్వామి, యర్రబాలెంలో బాలనాగేంద్ర స్వామి ఆలయంలోని శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు జరిపారు.

**కారంపూడి:** తొలి ఏకాదశి సందర్భంగా స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలోని సూరేశ్వరస్వామి ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చెన్నకేశస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు సత్యనారాయణాచార్యులు, సూరేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు సంజీవ్‌కుమార్, నగరేశ్వరస్వామి ఆలయంలో మణికంఠ పూజలు జరిపారు.

**మాచవరం:** మోర్జంపాడు శివారు అటవీప్రాంతంలో వేంచేసియున్న బుగ్గమల్లేశ్వరస్వామి దేవాలయంలో అభిషేకాలు నిర్వహించారు. మోర్జంపాడుతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు, అభిషేకాలు చేపట్టారు.

**దాచేపల్లి:** 500 సంవత్సరాల నుండి దాచేపల్లి గ్రామస్తులచే పూజలు అందుకుంటున్న శ్రీదేవి భూదేవి సమేత రంగనాయకస్వామి వారి దేవాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు క్రోసూరి రవికుమారాచార్యులు తులసి ఆకులతో పూజలు నిర్వహించారు. ఏకాదశితో ప్రత్యేకంగా తయారు చేసిన పేలపిండి ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు.

**నకరికల్లు** : చీమలమర్రిలోని సోమేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక అభిషేకాలు చేశారు. స్వామి వారిని విశేషంగా అలంకరించారు. భక్తులకు అన్నదానం చేశారు.

**అమరావతి** : వైకుంఠపురం గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి స్నపన, ప్రత్యేక అలంకారము, శాంతి కల్యాణం జరిగాయి. కొండ దిగువున వెంకటేశ్వరస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య ప్రారంభించారు.

**పెదకూరపాడు** : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆయా దేవాలయాల్లో భక్తి శ్రద్ధలతో పూజలను నిర్వహించారు. పెదకూరపాడులోని రామాలయంలో నిర్వహించిన తొలి ఏకాదశి పూజల్లో ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ సతీమణి భాష్యం లావణ్య పాల్గొన్నారు. దేవాలయాల్లో 24 గంటల పాటు భజనలు నిర్వహించారు.

**రెంటచింతల:** ప్రముఖ శైవ క్షేత్రమైన సత్రశాలలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వార్లను దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వేకువ జామునుంచే కృష్ణానదిలో స్నానమాచరించి స్ఫటిక స్పర్శ శివలింగాన్ని దర్శించుకోవడానికి భక్తుల క్యూలో నిల్చున్నారు. ఆలయ చైర్మన్ బ్రహ్మారెడ్డి దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పూజారి శర్మ నేతృత్వంలో అభిషేకాలు, తులసీ దళార్చనలు నిర్వహించారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన 19 అన్నదాన సత్రాలలో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.



దత్తాత్రేయ స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

## జీపీఎస్ జీవో నిలుపుదలపై హర్షం

రెంటచింతల,జూలై 17: కూటమి ప్రభుత్వం జీపీఎస్ జీవో గెజిట్ నిలుపుదల చేయటంతో యూటీఎఫ్, ఎస్టీయూ నేతలు వేర్వేరు ప్రకటనలో హర్షం వెలిబుచ్చారు. ఉద్యోగ ఉపాధ్యాయులను వైసీపీ ప్రభుత్వం జీపీఎస్ జీవోను గెజిట్ చేసి ఆందోళనకు గురి చేసిందన్నారు. గద్దెనెక్కిన 35 రోజుల్లో సీఎం చంద్రబాబు జీపీఎస్ గజిట్‌ను నిలుపుదలచేసి ఉద్యోగుల పక్షపాతిగా నిరూపించుకున్నారు. ఎస్టీయూ నేతలు లేళ్ల శ్రీనివాసరావు, జీ. గురుచంద్రశేఖర శర్మ, యూటీఎఫ్ నేతలు డాక్టర్ చిన్నమ్మ, బిచ్చిరెడ్డి, నాసరయ్య, జాన్ విజయ్ రాజ్‌కుమార్ తదితరులు సీఎం చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు.

## హెల్త్ క్లినిక్‌లకు కేంద్ర ప్రభుత్వ గుర్తింపు

రెంటచింతల, జూలై 17 : రెంటచింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మిట్టగుడిపాడు, గోలి విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు కేంద్ర ప్రభుత్వ గుర్తింపు లభించినట్లు పీహెచ్‌సీ డాక్టర్లు కృష్ణారెడ్డి, ప్రదీప్ కుమార్ రెడ్డిలు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాణ్యత సర్టిఫికేషన్ సంస్థ నిర్వహించిన సర్వేలో 84 పాయింట్లతో మెరుగైన వైద్యశాల జాబితాలో చోటు దక్కినట్లు వారు పేర్కొన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ వాత్సవ ఈ నెల 16న సర్టిఫికెట్లను పంపారన్నారు. పరిసరాల పరిశుభ్రత, వైద్యపరికరాల నాణ్యత, మందుల పంపిణీ, వైద్య సేవల తీరుపై కేంద్ర ప్రభుత్వ సంస్థ సర్వే చేపట్టగా రెంటచింత పీహెచ్‌సీకి కేంద్ర గుర్తింపు లభించిందని వైద్యులు కృష్ణారెడ్డి, ప్రదీప్‌లె తెలిపారు.



భట్లూరులోని ఏకలవ్యుడు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కన్నా నాగరాజు

## ఏకలవ్యుడి విగ్రహానికి నివాళులు

సత్తెనపల్లిరూరల్, జూలై 17: మండలలోని భట్లూరులో ఏకలవ్యుడి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. జయంతి వేడుకల్లో పాల్గొన్న గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు ఏకలవ్యుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈదర రామారావు, పోపూరి యతీష్, టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పట్టణ సీఐ బదిలీ

సత్తెనపల్లి, జూలై 17 : పట్టణ సీఐ పీ.శ్రీనివాసరావును రూరల్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నెల్లూరుజిల్లాకు చెందిన సుబ్రహ్మణ్యంను పట్టణ సీఐగా ఉన్నతాధికారులు నియమించారు. ఈనెల 21న సుబ్రహ్మణ్యం బాధ్యతలు చేపట్టనున్నారు.

## నేటి నుంచి జనసేన సభ్యత్వ నమోదు

● పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపు

మాచర్లటౌన్, జూలై 17: జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి పులి హరి తెలిపారు. బుధవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సభ్యత్వ నమోదు 10 రోజుల పాటు జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, వీరమహిళలు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నేతలు నక్షత్రపు ప్రసాద్, గుండెబోయిన సాంబశివరావు, రుద్రాల రవి, షేక్ అబ్దుల్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్ష ఫీజులో దివ్యాంగులకు రాయితీ

రెంటచింతల, జూలై 17: దివ్యాంగ విద్యార్థులకు 10వ తరగతి పరీక్ష ఫీజులో రాయితీ కల్పిస్తున్నట్లు సత్తెనపల్లి డిప్యూటీ ఈవో వీ.ఏసుబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెగ్యులర్ పరీక్షలకు హాజరయ్యే దివ్యాంగ విద్యార్థులకు ఫీజు మినహాయింపు వుంటుందని అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## అంబటి.. నీవా నీతులు చెప్పేది ?

ముప్పాళ్ళ, జూలై 17: ప్రభుత్వ సంస్థలను తమ జేబు సంస్థలుగా భావించి అడ్డగోలుగా దోచుకున్న వైసీపీ నాయకులు, అంబటి రాంబాబు నీతులు చెప్పటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని మండల టీడీపీ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు అన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు సోషల్ మీడియా వేదికగా టీడీపీని విమర్శించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బుధవారం ముప్పాళ్ళలో విలేకరుల సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని శాఖలను అడ్డగోలుగా దోచుకొని వేల కోట్ల అవినీతికి పాల్పడిన వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఛీకొట్టి కూటమికి ఘన విజయం అందించిన విషయాన్ని వైసీపీ నాయకులు గుర్తుంచు కోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గాడి తప్పిన ప్రభుత్వ వ్యవస్థలను సక్రమంగా నడిపిస్తుండటం, సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తుండటంతో ఓర్చుకోలేక వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు.

## అంతర్జాతీయ న్యాయ దినోత్సవం

సత్తెనపల్లి, జూలై 17 : అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది ఉల్లం శేషగిరిరావు తన కార్యాలయంలో పిడుగురాళ్ళ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.కుమార్ స్వామిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో ప్రతి న్యాయవాది తన కక్షిదారుడిని అన్నివిధాలా రక్షించేందుకే చూస్తాడని, ఈక్రమంలో న్యాయసూత్రాల ఉల్లంఘనలకు ఏమాత్రం పాల్పడకూడదని అన్నారు. కార్యక్రమంలో ఏపీపీ బీ.నరసింహారావు, బీ. శ్రీనివాసరావు, సాంబశివ రావు, వై శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# కలుషిత తాగు నీటితో ప్రజల ఇక్కట్లు

● ఐదేళ్లుగా శుభ్రం చేయని ఫిల్టర్ వాటర్ ట్యాంకులు
● రంగు మారిన నీరు తాగి రోగాలపాలౌతున్న ప్రజలు

దుర్గి, జూలై 17: ప్రజారోగ్యంపై అధికారులకు పట్టడం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యంతో మండలంలోని ధర్మవరం గ్రామస్తులు కలుషిత నీటిని తాగాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామంలో తాగునీరు సరఫరా చేయడానికి మూడు ఫిల్టర్ వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. వీటి ద్వారానే మండలంలోని దుర్గి, కోలగుట్ల, కంచరగుంట, ముటుకూరు, ఓబులేశునిపల్లె గ్రామాలకు నీటి సరఫరా జరుగుతుంది. ఐదేళ్లుగా వాటిని శుభ్రం చేయలేదు. దీంతో ట్యాంకులోని నీరు పాచి పట్టి లార్వా చేరి నీరు కలుషితమైంది. గత్యంతర లేని పరిస్థితుల్లో ఈ నీటిని తాగడం వలన ప్రజలు అనారోగ్యాల భారినపడుతున్నారు. కొత్త ఇసుకను నింపడానికి కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని, ప్రజారోగ్యంను పక్కన పెట్టి సంపాదన ధ్యేయంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కలుషిత నీరు వస్తుండడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నాలుగు రోజుల క్రితం నీటి సరఫరాను నిలిపివేశారు. అపరిశుభ్రంగా ఉన్న ఫిల్టర్ వాటర్ ట్యాంకుల వద్ద కలుషితమై రంగు మారిన నీటిని గ్రామస్థులు బక్కెట్ సాయంతో తోడుకొని నీటిని వినియోగించుకుంటున్నారు. పంచాయతీ పాలకులు, అధికారులు తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. సంబంధిత అధికారులు మండల పరిషత్ సమావేశాలకు హాజరై వెళ్తున్నారు తప్ప సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదు. విష జ్వరాలు ప్రభలుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, తమకు పరిశుద్ధమైన తాగునీటిని అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఫిల్టర్ వాటర్ ట్యాంకులో కలుషితమై రంగు మారిన నీరు



కలుషిత నీటిని బక్కెట్ ద్వారా పట్టుకుంటున్న మహిళలు





అచ్చంపేటలోని ట్రావెలర్స్ బంగ్లాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

## ట్రావెలర్స్ బంగ్లా నిర్వహణపై ఎమ్మెల్యే ఆగ్రహం

● రికార్డులపై ఆరా .. పరిశీలించాలని అధికారులకు ఆదేశం

అచ్చంపేట, జూలై 17 : మండల కేంద్ర మైన అచ్చంపేటలోని ట్రావెలర్స్ బంగ్లాను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బంగ్లా నలు దిక్కులా పరిశీలించి నిర్వహణపై అసంతృప్తి వ్యక్తంచేశారు. పంచాయతీ రాజ్ ఏఈ శేషప్పయ్యతో మాట్లాడి రికార్డుల గురించి ఆరా తీశారు. ఇక్కడ నిర్మించిన 18 రూమ్‌లు అద్దెకు నడుస్తుండగా, వాటికి సరిగా అద్దె చెల్లిస్తున్నారా? లేదా? అందుకు సంబంధించిన రికార్డులను తక్షణమే పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అద్దెకు ఇచ్చిన షాపుల బిల్డింగ్ పై నీరు నిలుస్తున్నాయని, వాటిని తొలగించాలని అధికారులకు సూచించారు. బంగ్లాలోని ఫర్నీచర్‌తో పాటు ఏసీలు కూడా లేవని, వీటిని దొంగిలించిన వారిపై కేసులు నమోదు చేయాలని అధికారులను కోరారు. బంగ్లా తలుపులు కూడా సరిగా లేవని, పాత బంగ్లా సమీపంలో పారిశుధ్య చర్యలు కూడా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, వెనిగండ్ల కోటయ్య, ఎస్‌కే కాసుల, తాళ్ళూరి లక్ష్మీనారాయణ, చల్లా అనూపకళ, సందెపోగు సామేలు, సందెపోగు వెంకయ్య, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు మట్టం భద్ర, యడ్లపల్లి బుచ్చిబాబు పాల్గొన్నారు.

## నెల రోజుల్లోనే పలు సమస్యలకు పరిష్కారం

● పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, జూలై 17 : ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోగా, అధికారం చేపట్టిన నెల రోజుల్లోనే కూటమి ప్రభుత్వ ఆయా పరిస్థితిని చక్కదిద్దేందుకు కృషి చేస్తుందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. బుధవారం టీడీపీ కార్యకర్తలతో కలసి దొడ్లేరు గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్ళారు. ఇప్పుడిప్పుడే గత ప్రభుత్వం చేసిన దురాగతాల నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తనకు అవగాహన ఉందని, సాధ్యమైనంత తొందరలో గ్రామాల్లోని సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం నేతలు ఎమ్మెల్యేను సత్కరించారు.

## అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

● దాచేపల్లి నగర పంచాయతీ కమిషనర్ నారాయణరావు

దాచేపల్లి, జూలై 17: వర్షాకాలం సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పనులు చేపట్టినట్లు దాచేపల్లి నగర పంచాయతీ కమిషనర్ నారాయణరావు తెలిపారు. దాచేపల్లిలోని బ్రాహ్మణగడ్డ, మహాలక్ష్మమ్మ గుడి వద్ద గత రెండు రోజులుగా జరుగుతున్న పారిశుధ్య పనులను బుధవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచడం, శానిటరీ పనులను చేయించడం, తాగునీటి పైపు లైన్‌లకు లీకులు లేకుండా చూడటం వంటి పనులను చేపట్టి నిర్వహించినట్లు తెలిపారు. ఎక్కడైనా తాగునీటి పైపు లైన్‌లకు లీకేజీ ఏర్పడి ఉన్నట్లు ప్రజలు గుర్తిస్తే తక్షణమే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన తెలియజేశారు. హోటళ్లలో పరిశుభ్రత లేకుండా, బయట బండ్లు విక్రయించే తినుబండారాలను తికుండా ఉండాలని సూచించారు. మొహర్రం, తొలి ఏకాదశి ఒకే రోజు రావడంతో భక్తులతో దాచేపల్లి కిటకిటలాడిందని, ఈ క్రమలో ఆలయాల వద్ద ఎటువంటి అపరిశుభ్రతకు తావులేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని కమిషనర్ నారాయణరావు తెలిపారు.



దొడ్లేరులో జరిగిన మొహరం వేడుకల్లో పీరును పట్టుకున్న ఎమ్మెల్యే ప్రవీణ్

## భక్తిశ్రద్ధలతో మొహరం

● దొడ్లేరు గ్రామంలో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, జూలై 17 : క్రోసూరు మండలంలో బుధవారం మొహరం వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. దొడ్లేరులో జరిగిన మొహరం వేడుకల్లో పాల్గొన్న పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీన్ పీరును పట్టుకొని ముస్లింలతో కలసి పర్యటించారు. పీర్ల చావిడిలో పీర్లకు ఆయన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్నొన్నారు. హసానాబాద్‌లో టీడీపీ నాయకులు షేక్ బడా, ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రవీణ్‌కు ఘన స్వాగతం లభించింది. గుడిపాడులో జరిగిన వేడుకల్లో టీడీపీ నేతలు గుడిపాడు బాషా, పలువురు పాల్గొన్నారు.

**మాచవరం** : మండలంలోని మాచవరం, తురకపాలెం, వేమవరం, గంగిరెడ్డిపాలెం, రేగులగడ్డ, పిల్లుట్ల, మోర్జంపాడు, శ్రీరుక్మిణీపురం, పిన్నెల్లి గ్రామాల్లో మొహరం వేడుకలను నిర్వహించారు. ఆయా గ్రామాల పురవీధులలో సాయంత్రం 4 గంటల నుండి పీర్లచావిడిల నుండి పీర్లు బయటకు తీసి పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల పెదబావులలో పీర్ల నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తిచేశారు.

**బెల్లంకొండ:** మండల కేంద్ర మైన బెల్లంకొండలోని మూడు పీర్ల చావిడిల వద్ద పీర్లను బయటకు తీసి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం యువకులు పలువేషాలతో నృత్యాలు చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తూ మేళ తాళాలతో భాజా భజంత్రీలతో నిమజ్జనానికి తరలించారు.

**నకరికలు :** మండలంలోని కుంకలగుంట, గుండ్లపల్లి గ్రామాల్లో మొహరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీర్లను గ్రామ వీధుల్లో ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

**దాచేపల్లి :** దాచేపల్లిలో మొహరం సందర్భంగా కర్రపీర్లు, గంధం పీర్లను ప్రధాన వీధులలో ఊరేగించారు. గంధం పీర్లకు ఓ ప్రత్యేకత వుంది. గంధం పీర్లు ప్రధాన వీధులలోకి రావడంతో కులమతాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలు పీర్లకు తమ మొక్కులు చెల్లించుకున్నారు. కేశానుపల్లి, తక్కెళ్లపాడు, పెదగార్లపాడు, రామాపురం, పొందుగల, తంగెడ, నడికూడి, గామాలపాడు గ్రామాలలోని చావిడిలలో వున్న పీర్లకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

**అచ్చంపేట:** అచ్చంపేటలో ముస్లింలు మొహరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ముస్లింలకు మొహరం శుభాకాంక్షలు తెలిపారు.

**పిడుగురాళ్ల:** మొహరం వేడుకలను అన్ని గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. పీర్లను గ్రామాలలోని పురవీధులలో ఊరేగించి ముస్లిం సోదరులు తమ భక్తిని చాటుకున్నారు. పిడుగురాళ్ల పీర్లచావిడి, జానపాడు, జూలకల్లు, గుత్తికొండ, కరాలపాడు పలు గ్రామాల్లో మొహరం వేడుకలు ఘనంగా జరిగాయి.



పీర్ల చావిడిల వద్ద ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

# పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



## త్రికోటేశ్వరుని దర్శించుకున్న ప్రత్తిపాటి



కోటప్పకొండ త్రికోటేశ్వరుని దర్శించుకుంటున్న చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూలై 17: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామిని ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం దర్శించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం ఆర్థిక అగాధం నుంచి బయట పడాలని తొలి ఏకాదశి పూజల సందర్భంగా ఆ త్రికోటేశ్వరుని వేడుకున్నట్టు మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. వేద పండితుల ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కొండ దిగువున ఉన్న కాకతీయ సత్రంలో కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన హోమంలో పాల్గొన్నారు. ధర్మం పాటించే గౌరవించే పాలనలో తప్పకుండా కోరిన కోర్కెలు తీరతాయనే నమ్మకంతో ఉన్నామన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం బ్రాండ్ ఏపీ బలోపేతం దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టే ప్రతి పని విజయవంతం కావాలని ఆ భగవంతుడిని కోరుకున్నట్టు ప్రత్తిపాటి తెలిపారు.

## కోడెల విగ్రహం ఏర్పాటుకు అనుమతించాలి

● స్టేడియం క్రీడాభివృద్ధి సంఘం ప్రతినిధుల వినతి



కలెక్టర్ అరుణబాబుకు వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడాభివృద్ధి సంఘం ప్రతినిధులు

నరసరావుపేట టౌన్, జూలై 17: నరసరావుపేట పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులో ఉన్న డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహం ఏర్పాటుకు అనుమతించాలని కలెక్టర్ పీ అరుణబాబుకు బుధవారం డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడాభివృద్ధి సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. స్టేడియంలో అవయవదానం కార్యక్రమం గురించి ప్రజలలో అవగాహన కల్పించి, మరణానంతరం అవయవాలు దానం చేసేలా ఒక గంటలో 11,986మందితో అంగీకారపత్రం ఇప్పించి గిన్నిస్ రికార్డులో క్రీడా ప్రాంగణానికి స్థానం పొందేలా చేశారన్నారు. ఆయన సేవలు భావితరాల వారు గుర్తుంచుకునేలా క్రీడా ప్రాంగణంలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహ ప్రతిమను ప్రతిష్ఠంచుకునేలా అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మందాడి రవి, షేక్ మస్తాన్ షరీఫ్, డాక్టర్ బండ్ల రామచంద్, కదం నాగజ్యోతి, కొత్తమాసు సుజాత లక్ష్మి, మిరియాల నాగప్రసాద్, క్రోసూరి లక్ష్మినారాయణ, ఇన్నమూరి శ్రీనివాసరావు, కోడెల శివప్రసాదరావు క్రీడాభివృద్ధి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



రాజా మాల్‌రాజ్ కొండల్‌రావు బహదూర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, సుబ్బరాయగుప్త, తదితరులు

## నరసరావుపేట జమీందార్‌కు ఎమ్మెల్యే సత్కారం

నరసరావుపేట టౌన్, జూలై 17: నరసరావుపేట జమీందార్ రాజా మాల్‌రాజ్ కొండల్‌రావు బహదూర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు బుధవారం వారి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించారు. నరసరావుపేట నియోజకవర్గంలో చేయనున్న అభివృద్ధి పనుల గురించి చర్చించారు. నరసరావుపేటను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలపాలనే తపనతో పని చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయ కుమార్, వనమా శివ, దినేష్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## శ్వేత పత్రాలతో వైసీపీ వెన్నులో వణుకు

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 17: రాష్ట్రానికి, ప్రజలకు జగన్‌రెడ్డి చేసిన దగా, ద్రోహాన్ని శ్వేతపత్రాల రూపంలో బయటపెట్టినప్పటి నుంచి జగన్‌రెడ్డి ముఠా వెన్నులో వణకు మొదలైందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. సహజవనరుల లూటీ, ప్రజా సంపద దోపిడీ గురించిన శ్వేతపత్రం విడుదల చూశాక రాష్ట్రాన్ని జగన్‌రెడ్డి ముఠా ఎంతలా భ్రష్టుపట్టించిందో తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగుతుందన్నారు. ప్రపంచంలో ఏ రాజకీయ నాయకుడు, పాలకుడు చేయని విధంగా రాష్ట్రంలో వ్యవస్థల్ని ధ్వంసం చేశారన్నారు. ఇళ్ల పట్టాల పంపిణీ నుంచి ఎర్రచందనం, ఇసుక, మట్టి, గ్రావెల్ సహా చివరికి ల్యాండ్ టైటిలింగ్ యాక్టు ద్వారా చేసిన దోపిడీ గురించి ప్రజలు తెలుసుకోవాలన్నారు. ప్రపంచంలో ఏ పాలకుడు చేయని విధంగా ప్రజల ఆస్తుల్ని కూడా దోచుకోవడానికి చేసిన ప్రయత్నం జగన్‌రెడ్డి దోపిడీ మనస్తత్వానికి నిదర్శనం అన్నారు. అందుకే గుజరాత్ మాదిరిగా ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ తీసుకొచ్చి, కబ్జాదారులు ఆ భూమి తనదేనని నిరూపించుకునేలా చట్టం తీసుకొస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం హర్షనీయం అన్నారు. చంద్రబాబు ప్రకటనతో వేల ఎకరాల పేదల భూములు దోచుకున్న జగన్‌రెడ్డి ముఠా భయంతో వణుకుతోందన్నారు. ప్రజల ఆస్తుల్ని కాపాడే బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, నష్టపోయిన ప్రతిఒక్క బాధితుడు ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు.

## కంది పప్పు మిల్లులో కిందపడి వ్యక్తి మృతి

వినుకొండ టౌన్, జూలై 17: కందిపప్పు మిల్లులో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కిందపడి మృతిచెందిన సంఘటన మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలో బుధవారం జరిగింది. బంధువుల కథనం ప్రకారం ప్రకాశం జిల్లా, పుల్లలచెరువు మండలం, నాయుడుపాలెం గ్రామానికి చెందిన పెద్దిటి వెంగయ్య (35) కందిపప్పు మిల్లులో పనిచేస్తున్నాడు. రోజువారీ పనుల్లో భాగంగా మిల్లులో పని చేస్తూ ప్రమాదవశాత్తూ కిందపడి తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వినుకొండలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా అప్పటికే వెంగయ్య మృతి చెందినట్లు వైద్యులు చెప్పారన్నారు. మృతుడికి భార్య దానమ్మ, ఇద్దరు కుమారులు. పోలీసులను వివరణ కోరగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

## పూడికతీత పనులతో నిధుల దుర్వినియోగం

● సామాజిక తనిఖీ గ్రామసభలో కొత్తలూరు గ్రామస్థులు

కొత్తలూరు (శావల్యాపురం) జూలై 17: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేయించకుండా కూలీలతో వాగుల్లో పూడికతీత పనులను నిర్వహించి లక్షలాది రూపాయల ఉపాధి హామీనిధులను దుర్వినియోగం చేశారని శావల్యాపురం మండలం కొత్తలూరు గ్రామస్థులు బుధవారం అధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన అభివృద్ధి పనులపై 17వ సామాజిక తనిఖీ గ్రామసభను కొత్తలూరు గ్రామసచివాలయంలో బుధవారం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ద్వారా కొత్తలూరు పంచాయతీ పరిధిలో 64లక్షలతో పనులు నిర్వహించారని, వాటి వివరాలు డీఆర్పీ గ్రామసభలో వివరిస్తుండగా గ్రామస్థులు కొందరు వారించారు. వాటిలో కనీసం రూ.4లక్షల పనులు కూడా మాకు ఉపయోగపడలేదన్నారు. గ్రామంలో పొలాలకు వెళ్ళే రోడ్లన్నీ చిత్తడిగా మారి వర్షాకాలంలో పొలాలకు వెళ్ళేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కనీసం పొలాల్లో పంట కాలువలు బాగుచేయించినా రైతులు వాటిని సొంతంగా బాగు చేయించుకునే అవసరం ఉండదన్నారు. ప్రజలకు ఉపయోగపడని పూడికతీత పనుల వలన నిధులన్నీ దుర్వినియోగమవుతున్నాయని వాపోయారు. ఉపాధి హామీ పథకం ద్వారా యంత్ర పరికరాలతో పనులుచేయకూడదని చెప్పే నిబంధనలు అమలుకావటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన సర్పంచ్ గుంటూరు నాగమల్లేశ్వరి, ఉపసర్పంచ్, టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావులు మాట్లాడుతూ ఈ ఏడాది గ్రామాలలో రైతులకు ఉపయోగపడే పనులు మాత్రమే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ కావూరి శ్రీనివాసరావు, ఎస్ఆర్పీ జేఎస్ రాజు, డీఆర్పీ శ్రీనివాసరావు, ఏపీవో రామారావు, టీఏలు బేబీరోజ, సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి మహేంధర్, ఫీల్డ్ అసిస్టెంట్ పోట్ల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## ఏకలవ్యుని జయంతి సందర్భంగా అన్నదానం

చిలకలూరిపేట, జూలై 17: పట్టణంలోని రైతు బజారు ఎదురుగా ఉన్న ఏకలవ్యుని విగ్రహం వద్ద తొలి ఏకాదశి, ఏకలవ్యుని జయంతిని పురస్కరించుకొని ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేసి అన్నదానం చేశారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు మద్దుల వెంకట కోటయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనునాయక్ మాట్లాడుతూ గురుభక్తిని చాటుకోవటం కోసం ఏకలవ్యుడు బొటనవేలును త్యాగంచేసి ద్రోణాచార్యునికి బహుమతిగా అందజేశారన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కె.నాగేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, వెంకటనగేష్, చిన్ననాయక్, పి.శ్రీనివాసరావు, డేవిడ్ పాల్గొన్నారు.

## వైభవంగా తొలి ఏకాదశి పూజలు



త్రికోటేశ్వరుని సన్నిధిలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, తదితరులు

నరసరావుపేట టౌన్, జూలై 17 : తొలి ఏకాదశి సందర్భంగా నియోజకవర్గంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. నరసరావుపేట మండలం ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ గిరిప్రదక్షిణ బుధవారం ఘనంగా జరిగింది. భక్తులు తెల్లవారు జామునుంచే కోటప్పకొండకు తరలి వచ్చి గిరిప్రదక్షిణ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోటప్పకొండ సోపానమార్గం వద్ద నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. ఆయన వెంట టీడీపీ శ్రేణులు గిరిప్రదక్షిణ చేశారు. గిరిప్రదక్షిణ మార్గం బాగుచేయడంతో భక్తులకు సౌకర్యవంతంగా ఉంది. అనంతరం కోటప్పకొండ త్రికోటేశ్వరుని దర్శనం చేసుకున్నారు. ముందుగా ఈవో శ్రీనివాసరెడ్డి, అర్చకులు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

### హిందూ సంప్రదాయంలో తొలి పండుగ: అరవిందబాబు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ హిందూ సాంప్రదాయంలో మొదటి పండుగ తొలిఏకాదశి అన్నారు. తొలిఏకాదశి పండగ ప్రతి శివాలయంలో, గుడిలో పూజలు ఘనంగా చేస్తారన్నారు. తొలకరి మొదలైనప్పుడు తొలి ఏకాదశి చేసుకుంటామన్నారు. తొలి ఏకాదశిలో విత్తనాలు వేసి వ్యవసాయం మొదలు పెడతామన్నారు. కోటప్పకొండలో తొలిఏకాదశి సందర్భంగా ఏర్పాట్లు బాగున్నాయన్నారు. డీఎఫ్‌వో, కోటప్పకొండ ఈవో సహకారంతో ఏర్పాట్లు ఘనంగా చేశారన్నారు. ప్రజలకు తొలిఏకాదశి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, అత్తులూరి సుబ్బారావు, వేల్పుల సింహాద్రి యాదవ్, కనుమూరి లక్ష్మి, డాక్టర్ కంకణంపాటి శ్రీనివాసరావు, డాక్టర్ పూరేటి భారతి దంపతులు, వేల్పుల సింహాద్రియాదవ్, కడియాల తాండవకృష్ణ, గంగుల పెద్దిరెడ్డి, సంజీవరావు, మాతంగి బంగారం, డాక్టర్ ఎస్ రాంప్రసాద్, టీడీపీ అభిమానులు, కార్యకర్తలు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

### రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల, జూలై 17: మండలంలోని గ్రామాల్లో తొలి ఏకాదశి పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో బుధవారం జరుపుకున్నారు. రొంపిచర్లలోని శంకరస్వామి, వడ్లమూడివారిపాలెంలోని నీలకంఠేశ్వరస్వామి, గోగులపాడులోని చంద్రమౌళేశ్వరస్వామి, విప్పర్లలోని వల్లభేశ్వర స్వామి, గోగులపాడు, సంతగుడిపాడు గ్రామాల్లో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయాలతో పాటు మిగిలిన ఆలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు కోటప్పకొండ, చేజర్ల తదితర పుణ్యక్షేత్రాలకు తరలివెళ్ళారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. పార్వతిదేవి అమ్మవారికి కుంకుమపూజ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం భజన కార్యక్రమాలు జరిగాయి.

### కల్యాణ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

నరసరావుపేట అర్బన్, జూలై 17: పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలోని శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారికి అభిషేకాలను అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్‌శర్మ నిర్వహించారు. ఆలయ ఆవరణలో పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ఆవరణలోని శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. కామేశ్వరస్వామి వారికి విశేష అలంకరణ నిర్వహించారు.

● శావల్యాపురం, జూలై 17: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కారుమంచి, మతుకుమల్లి, బొందిలిపాలెం, శావల్యాపురం, పోట్లూరు, గంటవారిపాలెం, వేల్పూరు తదితర గ్రామాల్లోని దేవాలయాలలో భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామునే దేవాలయాలకు వెళ్ళి స్వామివార్లకు పాలాభిషేకాలు, క్షీరాభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేక అలంకరణలు చేశారు. స్వామివార్లకు అర్చనలు, అభిషేకాలు, విశిష్ట పూజలు నిర్వహించారు. శావల్యాపురంలోని శివాలయంలో పూజారి రావిపాటి సాయిభరత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మతుకుమల్లిలోని శివాలయం, తూర్పు, దక్షిణ బజార్లలోని రామాలయాల్లో పూజారి పాపరాజు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కమిటీ సభ్యులు భక్తులకు పులిహోర, చక్రపొంగలి తదితర ప్రసాదాలను పంపిణీ చేశారు.



ప్రత్యేక అలంకరణలో రొంపిచర్లలోని శంకర స్వామి, విప్పర్ల వల్లభేశ్వర స్వామి

● నాదెండ్ల జూలై 17: మండలంలోని పలు గ్రామాల్లో తొలి ఏకాదశిని బుధవారం ఘనంగా నిర్వహించారు. గణపవరం, నాదెండ్ల, సాతులూరు, తూబాడు, అమీన్‌సాహెబ్‌పాలెం, చందవరం, కనపర్రు, సంక్రాంతిపాడు, చిరుమామిళ్ళ తదితర గ్రామాల్లో గల దేవాలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే మహిళలు తలస్నానాలు చేసి దేవాలయాలకు తరలి వచ్చారు. తెల్లవారుజామునే అధికసంఖ్యలో కోటప్పకొండకు తరలి వెళ్ళారు.

● ఈపూరు, జూలై 17: మండలంలోని పలు గ్రామాలలో తొలి ఏకాదశి పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. సంజీవకొండ,ఈపూరు,ముప్పాళ్ళ,కొచ్చెర్ల,కొండ్రముట్ల,బొగ్గరం గ్రామాలలోని శివాలయాలలో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు, అహోషేకాలు,అర్చనలు జరిపించారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## వినుకొండలో వైభవంగా తొలి ఏకాదశి తిరునాళ్ల



కొండపై బాలాలయంలోని శ్రీరామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన, అధికారులు



శ్రీరామ లింగేశ్వరస్వామి తిరునాళ్ళ సందర్భంగా కొండకు పోటెత్తిన జన సందోహం



ఎన్ఎస్పీ కాలనీ ఆవరణలో ఏర్పాటుచేసిన భారీ విద్యుత్ ప్రభలు

వినుకొండ టౌన్, వినుకొండ, జూలై 17: తొలి ఏకాదశి పండుగ సందర్భంగా వినుకొండ కొండపై శ్రీరామలింగేశ్వరస్వామి తిరునాళ్ల మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. చిన్న కొండపై ఉన్న గణపతి దర్శనం, అనంతరం కొండపై బాలాలయంలో ఏర్పాటు చేసి శ్రీగంగా పార్వతి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాంతి ఆశ్రమ ట్రస్ట్, ఆర్ఎస్ఎస్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. సాయంత్రం 6.30గంటల సమయంలో హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో కొండపై ఏర్పాటుచేసిన అఖండజ్యోతిని హిమాలయ గురూజీ వెలిగించారు. కొండపై అఖండ జ్యోతితో పాటు, అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన హిమాలయ గురువుకు వైవీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సాయంత్రం వెలిగించిన అఖండ జ్యోతినిచూసి భక్తులు పులకించిపోయారు. సుమారు 1000కేజీల నెయ్యితో మూడు రోజులపాటు ఈ జ్యోతి దర్శనం కొనసాగనుంది. తిరునాళ్ల సందర్భంగా కొండకు వచ్చే భక్తులకు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల ఆధ్వర్యంలో టెంట్లు ఏర్పాటుచేసి అన్నదానం చేశారు.

### పేలపిండి పంపిణీ చేసిన త్రిపులెక్స్ సోప్

తమిళనాడుకు చెందిన త్రిపులెక్స్ సోప్ ఎండీ మాణిక్యవేల్ తొలిఏకాదశి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని తన ఏజంటు భాస్కరరావు ద్వారా సుమారు టన్నుర పేల పిండిని భక్తులకు పంపిణీ చేయించారు. ఈ కార్యక్రమాన్ని గత 23 సంవత్సరాలుగా కొనసాగుతోంది.



తిరునాళ్ల సందర్భంగా పేలపిండిని పంపిణీచేస్తున్న భాస్కర్‌రావు, దారా మల్లికార్జునరావు కుటుంబ సభ్యులు

### అధిక ధరలపై ఎమ్మెల్యే ఆగ్రహం

వినుకొండ టౌన్, జూలై 17: తొలి ఏకాదశి పండుగ సందర్భంగా కొండపై దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొబ్బరికాయలు, కూల్ డ్రింక్స్ స్టాల్స్‌లో అధిక ధరలకు విక్రయాలపై దేవదాయశాఖ ఈవో హనుమంతరావు, సిబ్బందిపై బుధవారం ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొబ్బరి కాయ రూ.40, వాటర్ బాటిల్ రూ.40 రూపాయలకు విక్రయించటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

### చిన్న కొండకు పూర్వ వైభవం తెస్తాం...

తొలి ఏకాదశి తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని చిన్న కొండపైకి వచ్చే వేలాది మంది భక్తులకు శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పులిహోర, ప్రసాదాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జీవీ అంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ అయిదు సంవత్సరాలుగా చిన్న కొండకు వచ్చే గేట్లు గత పాలకులు మూసివేశారని, నేడు కొండపై చేసిన ఏర్పాట్లతో భక్తుల్లో కోలాహలం నెలకొందన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మాట్లాడుతూ త్వరలో కొండపై మెట్లు నిర్మించిన జనార్ధనరావు విగ్రహంతో పాటు, అల్లరి మూకల దాడిలో శిథిలమైన విగ్రహాలను దాతల సాయంతో పునర్నిర్మాణం చేపడతామన్నారు. త్వరలో ఘాట్‌రోడ్డుకు తారురోడ్డు వేయిస్తామని, వినుకొండ ప్రజలకు తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు, జలజీవన్ పథకాన్ని పూర్తిచేస్తానన్నారు. ఆర్టీసీసెంటర్, చెక్కపోస్టు సెంటర్, రంగా బొమ్మ సెంటర్, దక్షిణం బజార్, నర్సరావుపేట రోడ్లలలో వ్యాపారులు, రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు అన్నదానం నిర్వహించారు.

### ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

తొలి ఏకాదశి పండుగ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఏనుగుపాలెం రోడ్డులో ఒక డ్రామా, కోలాటం, ఎన్ఎస్పీ కాలనీ ఆవరణలో రెండు టీడీపీ భారీ విద్యుత్ ప్రభలు, కాలేజీ గ్రౌండ్‌లో ఒక జనసేన, ఒకటి దేవుడి ప్రభ నిర్మించి, ఏర్పాటుచేసిన పాట కచేరిలు పట్టణ వాసులను విశేషంగా ఆకట్టుకున్నాయి. లాయర్ స్ట్రీట్ నందు ఏర్పాటుచేసి పాటకచేరి యువతను ఉర్రూతలు ఊగించింది. పట్టణ వీధుల్లో ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## వైసీపీ అరాచకాలపై విచారణ చేపడతాం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 17: శ్వేతపత్రాలతో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అరాచకాలన్నీ బట్టబయలవుతున్నాయని, వీటిపై విచారణ చేపడతామని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడ కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ప్రజా సమస్యలను గాలికి వదిలేసి భూదందాల ద్వారా, సహజ వనరుల దోపిడీ ద్వారా తన అనుమాయులకు లబ్ధి చేకూర్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ఐదేళ్ల కాలంలో ఎన్ని వేల ఎకరాల భూదందాలకు పాల్పడ్డారో శ్వేత పత్రాల ద్వారా రాష్ట్ర ప్రజలముందు ఉంచడం జరిగిందన్నారు. వైసీపీ గత ఐదేళ్లలో 1,75,000 ఎకరాల భూదందాకు పాల్పడిందని, దాని ద్వారా రూ.35,500 కోట్లు దోపిడీ జరిగిందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అడ్డుపెట్టుకొని భూదందాలను కొనసాగించారని, ఇటువంటి భయంకరమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జీవో 512ను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. గ్రామాలలో జగనన్న కాలనీలు ఎక్కడ ఏర్పాటుచేయాలో ముందే నిర్ణయించుకొని, ఆ ప్రాంతంలోని భూములను తక్కువ ధరకు కొట్టేసి, ప్రభుత్వానికి మూడురెట్లు అధికంగా అమ్మి సొమ్ము చేసుకున్నారన్నారు. వైసీపీ జిల్లా కార్యాలయాల కోసం రెండు ఎకరాల చొప్పున నామమాత్రపు రుసుముతో 33ఏళ్లకు లీజ్‌రాసుకున్నారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం తీసుకు వచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని రద్దుచేసి, జేపీ వెంచర్స్ అనే ఒకే ఒక సంస్థకు అప్పజెప్పి దోపిడీకి తెరలేపారన్నారు. గృహ నిర్మాణశాఖకు సరఫరా పేరుతో 95లక్షల టన్నుల ఇసుకను బొక్కేశారన్నారు. అదేవిధంగా జేపీ వెంచర్స్ చెల్లించాల్సిన మొత్తం నుంచి రూ.800 కోట్లను తొలగించేశారన్నారు. మింగేసిన ఇసుకతో దాదాపుగా పది లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్ట వచ్చన్నారు. గత ప్రభుత్వం చేసిన అక్రమాలను శ్వేతపత్రం రూపంలో ప్రజల ముందు ఉంచడమే కాకుండా జరిగిన అక్రమాలపై విచారణ జరిపే పనిలో కూటమి ప్రభుత్వం ఉందని చెప్పారు.



కోటప్పకొండలో జరిగిన వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

## కోటప్పకొండపై శ్రీదత్త వైద్యశాల శిబిరం

నరసరావుపేట రూరల్, జూలై 17: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా కోటప్పకొండ దేవస్థానం వద్ద నరసరావుపేటకు చెందిన శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, గుండెవ్యాధుల వైద్య నిపుణుడు డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ తెలిపారు. వైద్య శిబిరాన్ని నరసరావుపేట శాసనసభ్యుడు చదలవాడ అరవింద్‌బాబు సందర్శించి డాక్టర్ గార్లపాటి కృష్ణ కాంత్‌ను అభినందించారు. వైద్య శిబిరంలో 600మందికి ఉచితంగా బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించి వారికి మందులు ఉచితంగా అందించారు. దైవదర్శనానికి వచ్చిన భక్తులకు అల్పాహారం, పదివేల మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ గార్లపాటి జ్ఞానేశ్వరి, డాక్టర్ చల్లా వెంకటేశ్వరరావు, డాక్టర్ తేజస్విని, జీఎం బైరెడ్డి ప్రవీణ్‌కుమార్, ఎం ఎం షేక్ ఖాసిం సైదా మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఫరూక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మొహరం పండుగ



నరసరావుపేట పట్టణంలో చేస్తున్న పీర్ల ఊరేగింపు

నరసరావుపేట, జూలై 17: మొహరం పండుగను బుధవారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. పీర్ల ఊరేగింపు ఘనంగా జరిగింది. పట్టణంలోని సత్తెనపల్లి బస్టాండ్, గుంటూరు రోడ్డు, శివుని విగ్రహం సెంటర్‌లోని పీర్ల చావిడిలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయా ప్రాంతాల నుంచి పీర్ల ఊరేగింపు ప్రారంభమైన శివుని విగ్రహం సెంటర్‌కు చేరుకుంది. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సత్తెనపల్లి బస్టాండ్‌లో నిర్వహించిన పీర్ల వేడుకల్లో పాల్గొన్నారు. మొహరం అంటేనే త్యాగానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మొహరం శుభాకాంక్షలు తెలిపారు.

### మహ్మద్ ప్రవక్త మనువళ్ల వీరోచిత త్యాగమే పీర్ల పండగ: అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 17: మహ్మద్ ప్రవక్త మనువళ్ల వీరోచిత త్యాగమే పీర్ల పండుగ అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. బుధవారం నరసరావుపేట పట్టణం కోట సెంటర్‌లో పీర్ల వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ముస్లింలు గౌరవప్రదంగా భావించే పీర్ల పండుగ వేడుకలలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మొహర్రం అంటే త్యాగానికి నిదర్శనమన్నారు. మహ్మద్ ప్రవక్త మనవళ్ళు హసన్, హుసేన్‌ల వీరోచిత ప్రాణ త్యాగానికి నిదర్శనం మొహర్రం అన్నారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

### కొండవీడుకు వేలాదిగా భక్తులు





హజ్రత్ ఆలీ పంజాను చేతపట్టి అగ్నిగుండంలో నడుస్తున్న భక్తుడు, కొండవీడు పీర్ల చావిడి వద్ద జరిగిన వేడుకలకు హాజరైన భక్తులు

యడ్లపాడు, జూలై 17: త్యాగానికి ప్రతీక అయిన మొహర్రం పండుగను మండల ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. కొండవీడు, కోట, బోయపాలెం, యడ్లపాడు, వంకాయలపాడు, తిమ్మాపురం, కారుచోల గ్రామాల్లోని చావిళ్ళలోని పీర్లను అందంగా అలంకరించారు. మొక్కులు చేసుకున్న భక్తులు పూల బాషికాలను చావిళ్ళలోని పీర్లకు ముజావర్లచే అలంకరింపచేశారు. ఈ సందర్భంగా మట్టి పాత్రలలో పానకాన్ని తెచ్చి చిన్నారులకు, భక్తులకు పంపిణీ చేశారు. సాయంత్రం ఆయా గ్రామాల్లోని పీర్లను మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు.

### కొండవీడులో సందడే సందడి..

మొహరం సంతాప దినాల్లో భాగంగా కొండవీడులో నిర్వహించే కార్యక్రమాలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మొహరం వేడుకలలో భాగంగా 11వ రోజున నిర్వహించే పెద్ద షరగత్ (ఊరేగింపు)కు ముందు 10వ రోజున నిర్వహించే అగ్నిగుండంలో నడిచే కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి అట్టహాసంగా నిర్వహించారు. నాలుగు రోజుల నుంచే కట్టెలను ముట్టించి నిప్పు కణికలను సిద్ధం చేసిన నిర్వాహకులు మంగళవారం సాయంత్రం పీర్ల చావిడిలో ప్రార్థనల అనంతరం రాత్రి 1.10గంటల సమయంలో విద్యుత్ వెలుగుల మధ్య నిప్పుల గుండంలో నడిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముజావర్ల కమిటీ సిద్ధం చేసిన హజ్రత్ ఆలీ పంజా (పీరు)ను భక్తులు చేతపట్టి కణకణలాడే నిప్పు కణికలపై తిరిగారు. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో 10రోజులపాటు నిర్వహించిన మొహర్రం వేడుకలు 11వ రోజైన బుధవారం పీర్ల జలధితో ముగిశాయి. చావిడిల వద్ద నుంచి పీర్లను చేతపట్టి మేళతాళాలతో గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించి పీర్లను జలధిలో కలిపారు. ఈ సందర్భంగా యువకులు కర్ర, కత్తి సాము విద్యలను ప్రదర్శించారు. పులి, ఎలుగు వేషాలతో చేసిన నృత్యాలు అలరించాయి.

## రహదారిపై నేడు ఆక్రమణల తొలగింపు

యడ్లపాడు, జూలై 17: యడ్లపాడు గ్రామ పరిధిలోని పదహారో నంబరు జాతీయ రహదారి సర్వీసురోడ్డుకు ఆనుకుని ఉన్న ఆక్రమణలను హైవే అధికారులు గురువారం తొలగించనున్నారు. దశాబ్దకాలం క్రిందట చెన్నై-కోల్‌కతా జాతీయరహదారిని ఆరువరుసల ఎక్స్‌ప్రెస్ హైవేగా విస్తరణ చేశారు. దీనితోపాటు సర్వీసు రోడ్లను ఏర్పాటు చేశారు. ఇందుకోసం అప్పట్లో ప్రభుత్వం భూసేకరణ చేసి భూయజమానులకు పరిహారం అందించింది. అయితే సర్వీసు రోడ్లకు ఆనుకుని హైవేకి చెందిన మిగులు భూమిని ఆక్రమించి పలువురు చిల్లర వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. కొంతమంది ఏకంగా సర్వీసు రోడ్డు పక్కన నిర్మించిన డ్రైయిన్‌లను ఆక్రమించి దుకాణాలను నిర్వహిస్తున్నారు. గ్రామస్తులు రోడ్డు పక్కన ఉన్న ఆక్రమణలను తొలగించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. దీనితో హైవే అధికారులు ఇటీవల దుకాణదారులకు నోటీసులు కూడా ఇచ్చారు.